RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

| నిజామాబాద్ | సంపుటి : 03 | సంచిక : 172 | జులై 23 గురువారం 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి | పేజీలు 08 | వెల : రూ. 6.00 |
|---|---|---|---|---|---|---|
| Nizamabad | Vol: 03 | Vol: 172 | July 23 Tuesday2026 | Editor : rachamallu madhavi | Pages 08 | Cost: Rs 6.00 |


కరీంనగర్‌లో అర్ధరాత్రి సాయుధ ముఠా బీభత్సం 2

# గత దశాబ్దంలో 152 పేపర్ లీకులు

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి: కేంద్ర ప్రభుత్వంపై రాహుల్ గాంధీ ధ్వజం

**న్యూఢిల్లీ జనసంఘర్షణ**
గత పదేళ్ల ఎన్డీయే పాలనలో దేశవ్యాప్తంగా 152 ప్రశ్నాపత్రాల లీకేజీ ఉదంతాలు వెలుగుచూశాయని, కానీ ఇప్పటివరకు ఒక్క కేసులో కూడా దోషులకు శిక్ష పడలేదని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ విపక్షనేత రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు. నీట్ పేపర్ లీక్ ఘటనకు నిరసనగా ఉద్యమిస్తున్న విద్యార్థులకు మద్దతుగా న్యూఢిల్లీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో ప్రతి వారానికి సగటున ఒక పేపర్ లీక్ జరుగుతోందని, దీనివల్ల సుమారు 7.50 కోట్ల మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలోకి నెట్టబడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో మొత్తం విద్యా వ్యవస్థ రిగ్గింగ్ బారిన పడిందని, ఈ ఘోర వైఫల్యానికి బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని, అలాగే ప్రధాని నరేంద్ర మోదీ దేశ యువతకు క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. దేశంలో విద్యారంగ వార్షిక బడ్జెట్ రూ. 1.42 లక్షల కోట్లు ఉంటే, కేవలం నీట్ పరీక్ష కోచింగ్ కోసమే అభ్యర్థులు ఏటా రూ. 1.32 లక్షల కోట్లు ఖర్చు చేయాల్సి వస్తోందని రాహుల్ గాంధీ గుర్తుచేశారు. ఈ వ్యత్యాసం

➢ మిగతా 2వ పేజిలో..



## హైదరాబాద్, కరీంనగర్‌లో కాంగ్రెస్, బీజేపీ పోటాపోటీ ఆందోళనలు

వీధుల ముట్టడితో ఉద్రిక్తత, పలువురి అరెస్ట్



**హైదరాబాద్ జనసంఘర్షణ**
నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారం, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అరెస్టును నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ, ప్రధాని నరేంద్ర మోదీ నివాసం ఎదుట కాంగ్రెస్ చేపట్టిన నిరసనలకు నిరసనగా బీజేపీ చేపట్టిన పిలుపులతో రాజధాని హైదరాబాద్‌తో పాటు కరీంనగర్‌లో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పిలుపు మేరకు కాంగ్రెస్ శ్రేణులు రాజ్‌భవన్ (లోక్‌భవన్) ముట్టడికి యత్నించగా, మరోవైపు బీజేపీ నాయకులు నాంపల్లిలోని గాంధీభవన్ ముట్టడికి దూసుకెళ్లారు. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయం వద్దకు కాంగ్రెస్ కార్యకర్తలు చేరుకోవడంతో ఇరువర్గాలు కర్రలతో పరస్పర దాడులకు తెగబడటంతో వాతావరణం రణరంగాన్ని తలపించింది. పోలీసులు తక్షణమే రంగంలోకి దిగి తోపులాటలను అదుపు చేస్తూ పలువురు నాయకులను అరెస్ట్ చేశారు. నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం నుంచి రాజ్‌భవన్ వైపు పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వివేక్ వెంకటస్వామి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ తదితరుల నాయకత్వంలో కాంగ్రెస్ భారీ ర్యాలీ నిర్వహించింది. ఖైరతాబాద్ సర్కిల్ వద్ద వీరిని అడ్డుకున్న పోలీసులు మహేష్ కుమార్ గౌడ్, దామోదర

➢ మిగతా 2వ పేజిలో..

## ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి కేసు విచారణ వాయిదా

**హైదరాబాద్ జనసంఘర్షణ**
హైదరాబాద్‌లో సంచలనం సృష్టించిన ట్రైనీ ఐపీఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డి పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. ఈ కేసుకు సంబంధించిన సమగ్ర వివరాలను నివేదించాలంటూ పోలీసు శాఖను ఆదేశించిన న్యాయస్థానం, తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేసింది. తనపై నమోదు చేసిన కేసును కొట్టివేయాలంటూ ఉదయ్ కృష్ణారెడ్డి హైకోర్టును ఆశ్రయించగా, పోలీసుల చర్యలపై స్టే విధించాలని ఆయన తరపు న్యాయవాది చేసిన అభ్యర్థనను కోర్టు తోసిపుచ్చింది. తనపై వచ్చినవన్నీ తప్పుడు ఆరోపణలని, కావాలనే కేసులో ఇరికించారని పిటిషనర్ పేర్కొన్నారు. మరోవైపు, తోటి మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారి ఇచ్చిన తీవ్రమైన ఫిర్యాదు ఆధారంగానే అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఈ కేసు నమోదైంది. బాధిత అధికారిణిని ఉదయ్ కృష్ణారెడ్డి లైంగికంగా వేధించడమే కాకుండా, ఆమెకు సంబంధించిన కొన్ని వ్యక్తిగత వీడియోలను ఆమె భర్తకు పంపి తీవ్ర మానసిక ఆందోళనకు గురిచేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో పోలీసులు ఆయనపై పలు తీవ్రమైన సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ వ్యవహారం మహిళా భద్రతకు సంబంధించినది కావడంతో, విచారణ పారదర్శకంగా జరిగేలా కేటాయించిన ఈ కేసును ఉన్నతాధికారులు సత్వరమే ఉమెన్ సేఫ్టీ వింగ్‌కు బదిలీ చేశారు. కేసు బదిలీ అయిన వెంటనే ఉమెన్ సేఫ్టీ వింగ్ దర్యాప్తును తీవ్రతరం చేసింది. దీనిలో భాగంగా డీసీపీ లావణ్య నాయక్ జాదవ్ బుధవారం నేరుగా సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ నేషనల్

➢ మిగతా 2వ పేజిలో..

## 'ఎల్ నినో' షాక్‌ను తట్టుకున్న తెలంగాణ విద్యుత్ వ్యవస్థ

### ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**హైదరాబాద్ జనసంఘర్షణ**
'ఎల్ నినో' ప్రతికూల వాతావరణ ప్రభావంతో వర్షాకాలంలోనూ వేసవిని తలపించేలా విద్యుత్ డిమాండ్ పెరగడం, మరోవైపు జల విద్యుత్ ఉత్పత్తి పడిపోవడంతో పడిన 7,000 మెగావాట్ల అదనపు భారాన్ని తెలంగాణ విద్యుత్ వ్యవస్థ అత్యంత సమర్థవంతంగా తట్టుకుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. హనుమకొండలోని ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (ఎ+చీూణజూ) ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రులు కొండ సురేఖ, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు, ఎన్‌పీడీసీఎల్ ఉన్నతాధికారులతో కలిసి ఆయన విద్యుత్ రంగా ప్రగతిపై చర్చించారు. సాధారణంగా వర్షాకాలంలో 11,000 మెగావాట్లుగా ఉండే పీక్ డిమాండ్ అనూహ్యంగా 16,500 మెగావాట్లకు చేరడం, సాగునీటి ప్రాజెక్టుల్లో నీటి లభ్యత లేక 2,000 మెగావాట్ల జల విద్యుత్ నిలిచిపోవడం పంపిణీ వ్యవస్థపై తీవ్ర ఒత్తిడి తెచ్చిందని భట్టి విక్రమార్క వివరించారు. అయినప్పటికీ, కాళేశ్వరం, దేవాదుల, సీతారామ వంటి ఎత్తిపోతల పథకాలతో పాటు రైతుల బోర్‌వెల్స్ అవసరాలకు సరిపడా విద్యుత్‌ను నిరంతరాయంగా



అందిస్తున్నామని స్పష్టం

## పొగాకు రైతుల సంక్షోభంపై చంద్రబాబు ప్రభుత్వంపై వైఎస్ జగన్ తీవ్ర ధ్వజం: త్వరలోనే గోదావరి జిల్లాల్లో పర్యటన

**తాడేపల్లి జనసంఘర్షణ**
ఆంధ్రప్రదేశ్‌లో ధరల సంక్షోభంతో అల్లాడుతున్న పొగాకు రైతులను చంద్రబాబు ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో పొగాకు రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిద్రపోతున్న ప్రభుత్వాన్ని లేపడం సులభమే

➢ మిగతా 2వ పేజిలో..

# హైదరాబాద్, కరీంనగర్‌లో కాంగ్రెస్, బీజేపీ పోటాపోటీ ఆందోళనలు

**మొదటిపేజీ తరువాయి..** రాజనర్సింహ సహా పలువురిని అదుపులోకి తీసుకుని నాంపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ముందస్తు చర్యల్లో భాగంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావుతో పాటు ఇరు పార్టీల కీలక నేతలు, కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేశారు.

ఇదిలావుండగా, ఈ ఆందోళనల సెగ కరీంనగర్‌కూ పాకింది. కరీంనగర్‌లో కేంద్రమంత్రి బండి సంజయ్ ఇంటిని ముట్టడించేందుకు కాంగ్రెస్ శ్రేణులు యత్నించగా, చేతుల్లో కర్రలతో ఉన్న బీజేపీ కార్యకర్తలు వారిని తీవ్రంగా అడ్డుకున్నారు. ఇరువర్గాలు ఒకరిపై ఒకరు రాళ్లు, చెప్పులతో దాడి చేసుకోవడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. దీనికి నిరసనగా జిల్లా కాంగ్రెస్ కార్యాలయాన్ని ముట్టడించేందుకు బీజేపీ యత్నించడంతో పరిస్థితి మరింత తీవ్రమైంది. అప్రమత్తమైన పోలీసులు లాఠీఛార్జ్ చేసి ఇరువర్గాల కార్యకర్తలను చెదరగొట్టారు. రెండు ప్రధాన పార్టీల పోటాపోటీ నిరసనల నేపథ్యంలో పోలీసులు నగరంతో పాటు కరీంనగర్‌లోనూ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# పొగాకు రైతుల సంక్షోభంపై చంద్రబాబు ప్రభుత్వంపై వైఎస్ జగన్ తీవ్ర ధ్వజం: త్వరలోనే గోదావరి జిల్లాల్లో పర్యటన

**మొదటిపేజీ తరువాయి..** కానీ, నిద్ర నటిస్తున్న చంద్రబాబు ప్రభుత్వాన్ని నిద్రలేపాలంటే గట్టిగా ఒత్తిడి తీసుకురావాల్సిందేనని వ్యాఖ్యానించారు. రైతుల కష్టాలను స్వయంగా తెలుసుకొని వారికి అండగా నిలిచేందుకు వచ్చే 10 రోజుల్లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని గోపాలపురం లేదా జంగారెడ్డిగూడెంలో పర్యటించనున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వం స్పందించకపోతే కందుకూరులోనూ పర్యటించి, సమస్య పరిష్కారమయ్యే వరకు రాష్ట్రవ్యాప్తంగా పోరాటాన్ని ఉద్ధృతం చేస్తామని స్పష్టం చేశారు.

రాష్ట్రంలో పొగాకు వేలం ప్రారంభమై 94 రోజులు గడిచినా, పండిన 232 మిలియన్ కిలోల పంటలో కేవలం 16.5 శాతం (38 మిలియన్ కిలోలు) మాత్రమే కొనుగోలు చేయడం ప్రభుత్వ ఘోర వైఫల్యానికి నిదర్శనమని జగన్ విమర్శించారు. సాధారణంగా 100 రోజుల్లో పూర్తికావాల్సిన ప్రక్రియ ఇంత మందకొడిగా సాగడంపై ఆందోళన వ్యక్తం చేశారు. సెప్టెంబరులో కర్ణాటకలో వేలం మొదలైతే ఇక్కడి వ్యాపారులు అక్కడికి వెళ్లిపోతారని, అప్పుడు ఏపీలోని మిగిలిన పంటను ఎవరు కొంటారని ప్రశ్నించారు. పొగాకు ధర రూ.200 కంటే తగ్గకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్షలో హెచ్చరించిన మరుసటి రోజే మార్కెట్లో ధరలు దారుణంగా పడిపోవడం వ్యాపారుల సిండికేట్ బలానికి, ప్రభుత్వ బలహీనతకు నిదర్శనమని ఎద్దేవా చేశారు. జంగారెడ్డిగూడెంలో రూ.170, గోపాలపురంలో రూ.130 దాకా ధరలు పడిపోయాయని, నో-బిడ్లు పెట్టడం, బేళ్లను తిరస్కరించడం ద్వారా రైతులను ముంచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

తన పాలనలో రైతుల కోసం దాదాపు రూ.3,000 కోట్లతో మార్కెట్ ఇంటర్వెన్షన్ ఫండ్ ఏర్పాటు చేశామని, ఐదేళ్లలో పంటల కొనుగోళ్లు, మార్కెట్ జోక్యం కోసం రూ.7,800 కోట్లు ఖర్చు చేశామని ఈ సందర్భంగా జగన్ గుర్తుచేశారు. ప్రతి రైతుభరోసా కేంద్రాన్ని (ఆర్బీకే) వ్యవసాయ ధరల పర్యవేక్షణ కేంద్రంగా మార్చి, సీఎం యాప్ ద్వారా నిరంతరం ధరలను పర్యవేక్షించామన్నారు. మార్క్‌ఫెడ్‌ను వేలం ప్లాట్‌ఫారమ్‌పైకి తీసుకురావడంతో వ్యాపారుల సిండికేట్ విచ్ఛిన్నమై రైతులకు గిట్టుబాటు ధర లభించిందని తెలిపారు. కానీ, ప్రస్తుత ప్రభుత్వం మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించకుండా వ్యాపారులకు కొమ్ముకాస్తోందని, నిబంధనలు ఉల్లంఘిస్తున్న కంపెనీలపై ఎటువంటి చర్యలు తీసుకోవడంలేదని మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే మార్కెట్లో జోక్యం చేసుకుని రైతులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## భూసేకరణపై మరో పిటిషన్ ఎందుకు

### న్యాయవాది తీరుపై హైకోర్టు అసహనం

**అమరావతి,** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి భూ సేకరణకు సంబంధించిన ప్రజాహిత వ్యాజ్యం పై హైకోర్టులో బుధవారం విచారణ జరిగింది. భూ సేకరణపై అభ్యంతరాలు ఉన్న బాధిత రైతులు ఇప్పటికే కోర్టును ఆశ్రయించినప్పుడు, మరో పిల్ ఎందుకని పిటిషనర్‌ను హైకోర్టు ప్రశ్నించింది. నోరులేని రైతుల తరఫున పిల్ దాఖలు చేశామని పిటిషనర్ తరఫు న్యాయవాది చేసిన వాదనను ధర్మాసనం తోసిపుచ్చింది. భూ సేకరణపై అభ్యంతరాలు వ్యక్తం చేయాల్సింది బాధిత రైతులేనని, పిటిషనర్‌కు ఈ వ్యవహారంతో ఉన్న సంబంధం ఏమిటని ప్రశ్నించింది. నిడమర్రు గ్రామానికి చెందిన జంగా నాగిరెడ్డి దాఖలు చేసిన ఈ పిల్‌పై ఆయన తరఫున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్ రెడ్డి వాదనలు వినిపించారు. అయితే, కోర్టు రాజకీయ వేదిక కాదని, కోర్టు అధికారిగా నిజాయతీగా విచారణలో కోర్టుకు సహకరించండని సీనియర్ న్యాయవాదిని హైకోర్టు ఆదేశించింది. వాక్‌చాతుర్యాన్ని పక్కన పెట్టి వాస్తవాలు, చట్టపరమైన అంశాలపై దృష్టి సారించాలని స్పష్టం చేసింది. పిటిషన్ విచారణార్హతపై పూర్తి స్థాయిలో వాదనలు వినిపించాలని ఆదేశించిన హైకోర్టు, తదుపరి విచారణను వాయిదా వేసింది.

# ‘ఎల్ నినో’ షాక్‌ను తట్టుకున్న తెలంగాణ విద్యుత్ వ్యవస్థ

**మొదటిపేజీ తరువాయి..** చేశారు. రాష్ట్రంలో ‘పవర్ కట్’ అనేదే లేదని, ప్రకృతి వైపరీత్యాల వల్ల స్తంభాలు లేదా వైర్లపై చెట్లు కూలినప్పుడు మాత్రమే జరిగే తాత్కాలిక అంతరాయాలను పవర్ కట్‌గా భావించవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సేవా ప్రమాణాలను పెంపొందించేందుకు దేశంలోనే తొలిసారిగా తెలంగాణలో ‘ఎలక్ట్రిసిటీ అంబ్యులెన్స్’ సేవలను ప్రారంభించినట్లు డిప్యూటీ సీఎం వెల్లడించారు. వినియోగదారులు ఉచిత టోల్ ఫ్రీ నంబర్ 1912 కు ఫోన్ చేయగానే, కృత్రిమ మేధస్సు (ఏఐ) ద్వారా సమాచారం వేగంగా అంబ్యులెన్స్ సిబ్బందికి చేరుతుందని, వారు నిమిషాల వ్యవధిలోనే సమస్యను పరిష్కరిస్తారని పేర్కొన్నారు. అలాగే, విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మరణించిన విద్యుత్ ఉద్యోగుల కుటుంబాలకు రూ. 1.20 కోట్ల బీమా సౌకర్యంతో పాటు అవసరమైన సేఫ్టీ కిట్లను అందిస్తున్నామని తెలిపారు. డిస్కంల అప్పులను రీస్ట్రక్చరింగ్ చేసి దేశంలోనే నంబర్-1గా తీర్చిదిద్దడంతో పాటు, ‘గృహజ్యోతి’ ద్వారా 53 లక్షల కుటుంబాలకు ఉచిత విద్యుత్, 30 లక్షల వ్యవసాయ పంప్‌సెట్లకు ఏటా రూ. 14,000 కోట్ల సబ్సిడీ సొమ్మును ప్రభుత్వం నేరుగా డిస్కంలకు విడుదల చేస్తోందని ఆయన స్పష్టం చేశారు.

# ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి కేసు విచారణ వాయిదా

**మొదటిపేజీ తరువాయి..** పోలీస్ అకాడమీ కి చేరుకున్నారు. అక్కడ ఉన్నతాధికారుల సమక్షంలో ఫిర్యాదు చేసిన మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారిణి వాంగ్మూలాన్ని రికార్డు చేసే ప్రక్రియను ప్రారంభించారు. ఈ వాంగ్మూలం కేసు విచారణలో అత్యంత కీలకమైన ఆధారంగా మారనుందని పోలీసులు భావిస్తున్నారు. ఈ సందర్భంగా ఫిర్యాదులో ఉన్న ఆరోపణలతో పాటు, అందుబాటులో ఉన్న డిజిటల్ ఆధారాలు, ఇతర సాంకేతిక సాక్ష్యాలను బృందం క్షుణ్ణంగా పరిశీలిస్తోంది.

ఉమెన్ సేఫ్టీ వింగ్ డీసీపీ నేరుగా రంగంలోకి దిగడంతో దర్యాప్తు మరింత వేగవంతమైంది. ప్రత్యేక దర్యాప్తు బృందం అకాడమీలోని ఇతర అధికారులు, సహచర ట్రైనీలు మరియు సంబంధిత వ్యక్తుల నుంచి కూడా వివరాలు సేకరించేందుకు సిద్ధమవుతోంది. కేసుకు సంబంధించిన అన్ని కోణాలను లోతుగా విశ్లేషించి, నిజా నిజాలను వెలికితీసేందుకు పోలీసులు శ్రమిస్తున్నారు. సోమవారం నాటికి హైకోర్టుకు సమర్పించాల్సిన నివేదిక సిద్ధం చేసే పనిలో అధికారులు నిమగ్నమవడంతో ఈ కేసు పరిణామాలు ఇప్పుడు తీవ్ర ఉత్కంఠను రేపుతున్నాయి.

## ఉద్యోగ సమస్యలపై చిత్తశుద్ధితో ఉన్నాం

### సమస్యలపై వారితో చర్చించాం: కేశవ్

**అమరావతి, :** ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో ఐదు గంటలపాటు సమావేశమై వారి ప్రధాన డిమాండ్లను సమగ్రంగా విన్నామని చెప్పారు. మొత్తం 21 ఉద్యోగ సంఘాల ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొని తమ సమస్యలు, డిమాండ్లను మంత్రి వర్గ ఉపసంఘం దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ.. ఉద్యోగ సంఘాల నుంచి వచ్చిన ప్రతి అంశాన్ని పూర్తిగా విన్నామని.. వాటన్నింటినీ సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ముఖ్యంగా వేతన సవరణ కమిషన్(పీఆర్‌సీ)ను వెంటనే ఏర్పాటు చేయడం, మధ్యంతర భృతి(ఐఆర్) ప్రకటించడం, పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయడం, ఉద్యోగులకు సంబంధించిన వివిధ బిల్లులను సకాలంలో చెల్లించడం వంటి ప్రధాన డిమాండ్లు ఉద్యోగ సంఘాల నుంచి వచ్చాయని చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుంటూనే ఉద్యోగుల సమస్యలకు సాధ్యమైనంత వరకు పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం యత్నిస్తుందని స్పష్టం చేశారు. ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు వేర్వేరు కాదన్న పయ్యావుల.. రాష్ట్ర అభివృద్ధి కోసం ఇరువర్గాలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ యంత్రాంగం సమర్థవంతంగా పనిచేస్తేనే ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని, అందుకే ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. అలాగే ప్రభుత్వ రంగ సంస్థలు, పబ్లిక్

సెక్టార్ అండర్‌టేకింగ్స్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల పదవీ విరమణ వయసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచే నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఉద్యోగ సంఘాలు లేవనెత్తిన అన్ని అంశాలపై ముఖ్యమంత్రితో సమగ్రంగా చర్చించి, ఆర్థికంగా సాధ్యమైన మేరకు సానుకూల నిర్ణయాలు తీసుకునేలా చర్యలు చేపడతామని మంత్రి

# గత దశాబ్దంలో 152 పేపర్ లీకులు

**మొదటిపేజీ తరువాయి..** పేద, మధ్యతరగతి కుటుంబాలకు చదువును ఏ స్థాయిలో భారంగా మార్చిందో స్పష్టం చేస్తోందన్నారు. శాంతియుతంగా నిరసనలు తెలుపుతున్న విద్యార్థులపై లాఠీఛార్జ్ చేయడాన్ని తీవ్రంగా ఖండించిన ఆయన, బాధ్యులైన పోలీసులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. ఒకప్పుడు దేశానికి గొప్ప సంపదగా ఉన్న విద్యావ్యవస్థను ఎన్డీయే ప్రభుత్వం పూర్తిగా ధ్వంసం చేసిందని, వ్యాపారవేత్తలకు లబ్ధి చేకూరుస్తూ సాధారణ ప్రజలకు విద్యను దూరం చేస్తోందని మండిపడ్డారు.

తాము విద్యార్థుల ఆందోళనలను రాజకీయం చేయడం లేదని, విపక్ష నేతగా ప్రజల గళాన్ని వినిపించడమే తన బాధ్యత అని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. పార్లమెంటులో ఈ అంశంపై మాట్లాడేందుకు ప్రభుత్వం అవకాశం ఇవ్వకపోవడం వల్లే తాను వీధుల్లోకి వచ్చి పోరాడాల్సి వచ్చిందని వివరించారు. దేశంలో నిరుద్యోగం పెరిగిపోతుందని, ఏఐ సాంకేతికత వల్ల ఉద్యోగాలు పోతుంటే, చైనా వస్తువుల దిగుమతితో స్థానిక పరిశ్రమలు మూతపడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులు దేశానికి శత్రువులు కారని, వారి ఆశలు, ఆకాంక్షలను తుంచేసే హక్కు ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. పారదర్శకమైన పరీక్షల విధానం కోసం విద్యార్థుల తరఫున ఎంతటి పోరాటానికైనా, ఎన్ని దెబ్బలు తినడానికైనా తాను సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు.

# కరీంనగర్‌లో అర్ధరాత్రి సాయుధ ముఠా బీభత్సం

### కుటుంబసభ్యులను బంధించి భారీ దోపిడీ

కరీంనగర్ నగరం భగత్ నగర్ ప్రాంతంలో అర్ధరాత్రి వేళ ఘోర సాయుధ దోపిడీ తీవ్ర కలకలం రేపింది. ముసుగులు ధరించి, ఆయుధాలతో ఇంట్లోకి చొరబడిన దుండగుల ముఠా, కుటుంబ సభ్యులను కత్తులు, తుపాకులతో బెదిరించి విచక్షణారహితంగా దాడి చేసింది. ఇంట్లోని వారిని కట్టివేసి భయాందోళనకు గురిచేస్తూ, భారీగా బంగారం, నగదుతో పాటు ప్రాంగణంలో ఉన్న వాహనాలను కూడా అపహరించుకుపోయింది. అర్ధరాత్రి సుమారు 12:30 గంటల సమయంలో, ఇంటి యజమాని లైట్ ఆపేందుకు బయటకు రాగా, ముసుగు దొంగలు ఒక్కసారిగా లోపలికి చొరబడ్డారు. యజమానితో పాటు ఇంట్లోని ముగ్గురు మహిళలను తుపాకులు, కత్తులతో బెదిరించి, బట్టలు, ఓణీలతో కాళ్లు-చేతులు కట్టేసి తీవ్రంగా కొట్టారు. అడ్డుచెప్పకుండా నోరు మూయించి, గంటన్నర పాటు ఇంట్లో విధ్వంసం సృష్టించిన దొంగలు, బీరువాలోని భారీగా బంగారం, రూ. 50 లక్షలకు పైగా విలువైన నగదును దోచుకెళ్లారు. అనంతరం బయట పార్క్ చేసి ఉన్న రెండు బైకులను ఎత్తుకెళ్లి, బైపాస్ నుంచి మానేరు బ్రిడ్జి మీదుగా వరంగల్ వైపు పరారైనట్లు ప్రాథమికంగా గుర్తించారు. దొంగలు హిందీ భాషలో మాట్లాడారని, వారి వద్ద నకిలీ పిస్టల్ సహా ఇతర ఆయుధాలు ఉన్నాయని బాధితులు పోలీసులకు తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే క్లూస్ టీమ్‌లతో కలిసి సీసీటీవీ దృశ్యాలను ఆధారంగా చేసుకుని పోలీసులు గాలింపు చర్యలు వేగవంతం చేశారు. ఈ ఘటనపై బాధితుల సమాచారం మేరకు ఉత్తర భారతదేశానికి చెందిన వృత్తిపరమైన దొంగల ముఠా ప్రమేయం ఉందా అన్న కోణంతో పాటు, బాధితుల పెద్ద అల్లుడు ఢిల్లీలో నివాసముంటుండటం వల్ల కుటుంబ వివాదాల కోణంలోనూ దర్యాప్తు జరుపుతున్నట్లు కరీంనగర్ పోలీసులు తెలిపారు. త్వరలోనే నిందితులను అరెస్టు చేసి, పోయిన సొత్తును స్వాధీనం చేసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.

## నీట్ లీక్‌పై రాజకీయాలు తగవు

### తోలైతన చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది: నడ్డా

**న్యూఢిల్లీ, జూలై22 :** నీట్ పేపర్ లీక్ అంశంపై పార్లమెంటు వేదికగా లోతైన చర్చకు తాము సిద్ధమేనని కేంద్ర మంత్రి జేపీ నడ్డా తెలిపారు. పేపర్ లీక్ అంశం, విద్యార్థుల నిరసనలతో రాజకీయాలు వద్దని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు ముందుకు రావాలని అన్నారు. విద్యార్థుల డిమాండ్స్, సమస్యలతో రాజకీయం చేసి లాభం పొందేందుకు ప్రయత్నించడం తగదని మంత్రి జేపీ నడ్డా అన్నారు. కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల్లో పేపర్ లీక్ ఉదంతాలపై రాహుల్ గాంధీ ఎందుకు స్పందించట్లేదని మంత్రి నడ్డా ప్రశ్నించారు. జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఝార్ఖండ్, తెలంగాణ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, పంజాబ్, కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో పేపర్ లీక్ ఉదంతాలు వెలుగు చూశాయని అన్నారు. కేవలం ఎన్డీయే పాలిత రాష్ట్రాల్లోని అంశాలనే ఎందుకు ఎంచుకుంటున్నారని అన్నారు. 150 పేపర్ లీక్ ఉదంతాలు వెలుగు చూశాయన్న రాహుల్ గాంధీ ఆరోపణపై కూడా మంత్రి స్పందించారు. ప్రతి కేసుపై దర్యాప్తు చేసేందుకు తాము సిద్ధంగానే ఉన్నామని అన్నారు. 'ఈ ఆరోపణలపై దర్యాప్తు జరగాలి. మాది బాధ్యతగల ప్రభుత్వం. కాబట్టి, అన్ని కేసులపై దర్యాప్తు చేసి నిజానిజాలను ప్రజల ముందు ఉంచుతాము' అని నడ్డా అన్నారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక



## కొమరం భీమ్ విగ్రహ పటిష్టత కోసం ఘనంగా భూమి పూజ కార్యక్రమం

- ఆదివాసీ జేఏసీ చర్ల మండలం కమిటీ



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చర్ల మండలం, జులై 22(జనసంఘర్షణ): ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా చర్ల మండల కేంద్రంలో ఏర్పాటు చేయనున్న కొమరం భీమ్ విగ్రహ పటిష్టత కోసం, జూలై 22, 2026న ఆదివాసీ జేఏసీ చర్ల మండలం కమిటీ ఆధ్వర్యంలో భూమి పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ పెద్దలు, ఆదివాసీ ఉపాధ్యాయులు, ఆదివాసీ మహిళలు, ఆదివాసీ యువకులు, చర్ల మండల ప్రముఖులు, సామాజిక కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కొమరం భీమ్ ఆశయాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. జల్ జంగల్ జమీన్ నినాదంతో ఆదివాసీ హక్కుల కోసం పోరాడిన మహావీరుడు కొమరం భీమ్ స్ఫూర్తిని భావితరాలకు చాటిచెప్పేందుకు చర్ల మండల కేంద్రంలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ విగ్రహం ఆదివాసీ సమాజ ఆత్మగౌరవానికి, ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ జేఏసీ చైర్మన్ వాసం. ముసలయ్య, నూగురు మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరప శ్రీనివాస్ రావు, సోయం రాజారావు, తాటి రామకృష్ణ, ఇరప రాజు దొర, కారం నరేష్, ఆదివాసీ పెద్దలు సరేం సమ్మయ్య, పూనెం వరప్రసాద్, ఇరప ప్రకాష్ దొర, శ్యామల తరుణ్, ఇరప వసంత్, బీరబోయిన శేఖర్, ఆదివాసీ ఉపాధ్యాయులు బెండబోయిన సత్యనారాయణ, శ్యామల రామారావు, బెండబోయిన మురళి, కాకా రాంబాబు, పరిష్క నాగేశ్వరావు, సోయం శేషు, మీడియం ఇడమరాజు, ఆదివాసీ మహిళాలు ఇరప అపర్ణ, బీరబోయిన రాణి, బీరబోయిన అరుణ తదితరులు పాల్గొన్నారు. అలాగే రానున్న ఆగస్టు 9 న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా కొమరం భీమ్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఆదివాసీ కుటుంబం, యువత, మహిళలు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని సహకరించాలని ఆదివాసీ జేఏసీ చర్ల మండలం కమిటీ పిలుపునిచ్చింది.

## తాలిపేరు నీటిని కుడి ఏడమ కాలువ రైతులకు అందించండి

- నూగురు మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరప శ్రీనివాసరావు



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చర్ల మండలం, జులై 22(జనసంఘర్షణ): తాలిపేరు ప్రాజెక్ట్ నీళ్లు వృధాగా గోదావరి లో వదలకుండా, ఈ ప్రాంతం రైతులకు ఉపయోగపడే విధంగా అధికారులు ఆలోచన చెయ్యాలి. తాలిపేరు ప్రాజెక్ట్ కుడి, ఎడమ కాలువల ద్వారా వెంటనే నీరు విడుదల చేసి రైతులకు సకాలంలో నీటిని అందించాలి. చర్ల మండల రైతుల సాగు అవసరాలను దృష్టిలో ఉంచుకుని తాలిపేరు ప్రాజెక్ట్ నుంచి కుడి కాలువ, ఎడమ కాలువల ద్వారా వెంటనే సాగునీటిని విడుదల చేసి రైతులకు సకాలంలో అందించాలని, నూగూరు మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరప శ్రీనివాస్ ప్రభుత్వ అధికారులను కోరారు. ప్రస్తుతం ఖరీఫ్ సాగు పనులు జోరుగా కొనసాగుతున్న నేపథ్యంలో రైతులకు నీరు అత్యవసరమని ఆయన పేర్కొన్నారు. సాగునీరు ఆలస్యమైతే పంటలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు పరిస్థితిని వెంటనే సమీక్షించి, తాలిపేరు ప్రాజెక్ట్ నుంచి కుడి, ఎడమ కాలువల ద్వారా నీటిని విడుదల చేసి చర్ల మండలంలోని ఆయకట్టు భూములకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమైతే, సాగునీటి సమస్యను అత్యంత ప్రాధాన్యంతో పరిష్కరించాలని ఇరప శ్రీనివాస్ రావు కోరారు.

## పోడు రైతులకు పట్టాలు ఇవ్వాలి

- సీజనల్ వ్యాధులపై యంత్రాంగం అప్రమత్తమవ్వాలి
- గ్రామాలలో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలి




మంచిర్యాల జిల్లా, బెల్లంపల్లి పట్టణం, జులై 22(జనసంఘర్షణ): బెల్లంపల్లి పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో దాగం రాజారాం అధ్యక్షతన సీపీఎం బెల్లంపల్లి ఏరియా కమిటీ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి సీపీఎం జిల్లా కార్యదర్శి బోడెంకి చందు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. వర్షాకాలం ప్రారంభం కావడంతో జిల్లాలో పోడు భూముల్లో విత్తనాలు నాటేందుకు వెళ్తున్న రైతులను అటవీ శాఖ,ఫారెస్ట్ అధికారులు అడ్డుకుంటూ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో అనేకమంది రైతులకు పోడు వ్యవసాయం తప్ప వేరే జీవనోపాధి లేదని, ఇలాంటి సమయంలో అధికారులు నిర్బంధాలకు గురిచేస్తే ఆ పేద కుటుంబాలు ఎలా బతకాలని ప్రశ్నించారు. రైతులు స్వేచ్ఛగా వ్యవసాయం చేసుకునేలా చూడాలని, పోడు భూములకు ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం వెంటనే పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు చేపట్టాలి, వర్షాల నేపథ్యంలో గ్రామాల్లో సీజనల్ జ్వరాలు, ఇతర అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరించారు. జిల్లా యంత్రాంగం ఆరోగ్య శాఖ తక్షణమే అప్రమత్తమై గ్రామాల్లో శానిటేషన్ పనులు చేపట్టి, మురుగు కాలువలను, మోరీలను శుభ్రం చేయించాలి. బ్లీచింగ్ పౌడర్ చల్లించి, నివాసాల వద్ద నీరు నిల్వ ఉండకుండా చూడాలి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా రక్తం, మూత్ర పరీక్షలు బ్లడ్ , యూరిన్ టెస్ట్స్ నిర్వహించి, అవసరమైన మందులను అందుబాటులో ఉంచి మెరుగైన వైద్యం అందించాలి. గుమాస అశోక్ మాట్లాడుతూ.. బెల్లంపల్లి పట్టణంలో ఆరు నెలల క్రితం రోడ్డు వెడల్పు పనుల కోసం ఇరువైపులా ఉన్న చిరు వ్యాపారులు, చేపల,పూల దుకాణాలు, ఫుట్‌పాత్ షాపులను తొలగించారని తెలిపారు. అయితే, రోడ్డు తవ్వకాలు జరిపి కంకర వేసి నెలల తరబడి అలానే వదిలేయడం వల్ల వాహనదారులు, పట్టణ ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ అధికారులు స్పందించి నిలిచిపోయిన రోడ్డు పనులను వెంటనే ప్రారంభించి వేగంగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఎం ఏరియా కమిటీ సభ్యులు అబ్బోజు రమణ, చల్లూరి దేవదాస్, దాగం రాజారాం, పేల్పుల శంకర్, దుర్గం సజీవన్, దాగం శ్రీకాంత్ పాల్గొన్నారు.

## విద్యార్థులపై లాఠీచార్జ్ దారుణం

- ప్రశ్నించే గొంతుకలను అణచొద్దు.
- నీట్ లీకేజీపై పార్లమెంట్‌లో చర్చ జరపాలి.
- కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి.
- మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి.



ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 22:(జన సంఘర్షణ) ఢిల్లీలో తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం శాంతియుతంగా నిరసన చేపట్టిన విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి అన్నారు.ఈ ఘటనను తాను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రశ్నించే హక్కు ప్రతి పౌరుడికి భారత రాజ్యాంగం కల్పించిందని, ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే గొంతుకలను అణచివేయడం సమంజసం కాదన్నారు. ప్రభుత్వం ప్రజల సమస్యలను వినాలే తప్ప, బలప్రయోగంతో నిరసనలను అణచివేయకూడదని సూచించారు. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని, పార్లమెంట్‌లో విద్యార్థుల సమస్యలు, నీట్ పేపర్ లీకేజీపై సమగ్ర చర్చ నిర్వహించాలని కోరారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో విద్యార్థుల ఆందోళన సందర్భంగా జరిగిన ఘటనలపై స్వతంత్ర న్యాయ విచారణ జరిపించాలని, నీట్ పేపర్ లీకేజీ కారణంగా ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలకు తగిన పరిహారం అందించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. దేశవ్యాప్తంగా పారదర్శక పరీక్షా విధానాన్ని అమలు చేసి విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పించాలని పద్మా దేవేందర్‌రెడ్డి కోరారు.

## రామాయంపేట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సరాఫ్ యాదగిరి మనవడి నామకరణ మహోత్సవానికి వచ్చిన మల్కాజ్గిరి మాజీ ఎమ్మెల్యే మైనాంపల్లి హనుమంతరావు

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 22 (జన సంఘర్షణ)



మెదక్ జిల్లా రామాయంపేట మాజీ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సరాఫ్ యాదగిరి మనవడి నామకరణ మహోత్సవానికి విచ్చేసిన మల్కాజిగిరి మాజీ శాసనసభ్యులు మైనంపల్లి హనుమంతరావు, రామాయంపేట మున్సిపల్ ఇంచార్జ్ మహిపాల్ రెడ్డి వారితోపాటు స్థానిక మున్సిపల్ చైర్మన్ గజవాడ లావణ్య నాగరాజ్, కౌన్సిలర్స్ పుట్టి సందీప్, దేవుని రంజిత్ కో ఆప్షన్ మెంబర్ దేమే యాదగిరి, డి సి సి ఉపాధ్యక్షులు చింతల యాదగిరి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రమేష్ రెడ్డి, మాజీ పట్టణ అధ్యక్షుడు దాకి స్వామి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చింతల స్వామి, ఎనిశెట్టి అశోక్, దామోదర్ రాధా కిషన్,బైరాం శంకర్, అబ్బాస్, మాజీ కౌన్సిలర్స్ దేవుని రాజు, సుందర్ సింగ్. పాల్గొన్నారు.

## “విద్యార్థుల గొంతు నొక్కితే ప్రజాస్వామ్యం బతకదు”

- ఢిల్లీలో విద్యార్థులపై లాఠీచార్జీకి నిరసనగా సింగరేణి కాంగ్రెస్ ఆందోళన




సింగరేణి ప్రతినిధి: (జన సంఘర్షణ) ఢిల్లీలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జీ చేయడం అమానుషమని మండల కాంగ్రెస్ నాయకులు తోటకూరి రాంబాబు మండిపడ్డారు. ఈ ఘటనకు నిరసనగా బుధవారం కారేపల్లి క్రాస్‌రోడ్డు వద్ద మండల కాంగ్రెస్ నాయకత్వంలో నాయకులు, కార్యకర్తలు రోడ్డుపై బైఠాయించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామ్మూర్తి నాయక్ మాట్లాడుతూ.. దేశ విద్యా వ్యవస్థను కార్పొరేట్ శక్తులకు అప్పగించే కుట్రలో భాగంగానే విద్యార్థులపై లాఠీలు ఎగురవేస్తున్నారని ఆరోపించారు. పరీక్షల నిర్వహణలో పారదర్శకత లేకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని, ఈ పరిస్థితుల్లో పలువురు విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడటం అత్యంత విషాదకరమని పేర్కొన్నారు. పార్లమెంట్‌కు సమీపంలో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులను అడ్డుకుని బలప్రయోగానికి దిగడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఆయన విమర్శించారు. జరిగిన ఘటనలకు పూర్తి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అలాగే విద్యార్థులపై నమోదైన కేసులను తక్షణమే ఉపసంహరించుకోవాలని, లాఠీచార్జీకి బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, వివిధ గ్రామాల సర్పంచులు, కార్యకర్తలు, యువ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గుండెపోటుతో మృతి చెందిన మోహన్‌రెడ్డికి కంఠరెడ్డి తిరుపతిరెడ్డి ఘన నివాళి

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 22 (జన సంఘర్షణ)



మెదక్ పట్టణంలోని 5వ వార్డులో ర్యాలమడుగు గ్రామానికి చెందిన గంగన్న మోహన్‌రెడ్డి మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. ఈవిషయం తెలుసుకున్న బీఆర్ఎస్ జిల్లా నాయకులు కంఠరెడ్డి. తిరుపతిరెడ్డి వారినివాసానికి వెళ్లి మోహన్‌రెడ్డి పార్థివదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మోహన్‌రెడ్డి ఆకస్మిక మరణం తీవ్ర విషాదకరమని పేర్కొంటూ కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు.వీరి వెంట పట్టణ పార్టీ కన్వీనర్, కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కసిరెడ్డి. మాణిక్యరెడ్డి, మహీంద్రా మాజీ చైర్మన్ మదన్‌మోహన్‌రావు, ఏడుపాయల దేవస్థానం మాజీ చైర్మన్ బాలగౌడ్, పాపన్నపేట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్‌రెడ్డి, నాయకులు సాదిక్ తదితరులు ఉన్నారు.

## రుద్రూర్‌లో ఉచిత మధుమేహ పరీక్ష కేంద్రాన్ని ప్రారంభించిన లయన్స్ క్లబ్



రుద్రూర్: జూలై 22( జన సంఘర్షణ) నిజామాబాద్ జిల్లా రుద్రూర్ మండలం బుధవారం 10 గంటల 30 నిమిషాలకు ప్రారంభం చేశారు. లయన్స్ క్లబ్ ఆఫ్ రుద్రూర్ వారి ఆధ్వర్యంలో ప్రతిరోజు ఉదయం 7:00 గంటల నుండి 7:30 నిమిషాల వరకు ఉచిత మధుమేహ పరీక్షల కేంద్రాన్ని బస్టాండ్ ముందు గల మహేశ్వరి ఫస్ట్ ఎయిడ్ క్లినిక్ లో బుధవారం ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమానికి లయన్స్ కంటి ఆసుపత్రుల వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ గవర్నర్, జిఎంటి ఎండి320 లయన్ పోలవరపు బసవేశ్వర రావు ముఖ్య అతిధిగా విచ్చేసి ప్రారంభించారు ఈ సందర్భంగా ముఖ్య అతిథి మాట్లాడుతూ.. లయన్స్ జిల్లా 320 డి లో 130 పైచిలుకు క్లబ్బులు ఉండగా ఇందులో నాలుగు ఐదు క్లబ్బులు మాత్రమే ప్రతిరోజు మధుమేహ పరీక్షలు చేస్తారని ఇందులో లయన్స్ క్లబ్ ఆఫ్ రుద్రూర్ వారు ఇలాంటి మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టి ప్రారంభించడం రుద్రూర్ గ్రామ ప్రజలకు గర్వకారణం అని అన్నారు. గ్రామ ప్రజలు ఈ మంచి అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమానికి ప్రతిరోజు ఉచితంగా మధుమేహ పరీక్షలు చేయడానికి చాలా డబ్బు అవసరం ఉంటుంది కాబట్టి తన వంతు సహాయంగా ముఖ్య అతిథి 5000 రూపాయలను క్లబ్ అధ్యక్షులకు అందజేశారు. అదేవిధంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్న జీఈటి కోఆర్డినేటర్, రీజియన్ చైర్మన్, జోన్ చైర్మన్ లు కూడా రెండు నెలలకు సరిపడా స్ట్రిప్స్ అందజేస్తామని తెలియజేశారు. ఇంకా ఈ కార్యక్రమానికి జి ఈ టి కోఆర్డినేటర్ లయన్ పల్లెంపాటి శ్రీధర్, రీజియన్ చైర్మన్ లయన్ తన్నీరు సుబ్బారావు జోన్ చైర్మన్ లయన్ గణపురం అశోక్ గౌరవ అతిథులుగా విచ్చేశారు. ఇంకా ఈ యొక్క కార్యక్రమంలో జిఎస్టి కోఆర్డినేటర్ లయన్ శ్యాంసుందర్ పహాడే, జిల్లా అధ్యక్షులు లయన్ కెవి మోహన్, క్లబ్ అధ్యక్షులు లయన్ గుండూరు ప్రశాంత్ గౌడ్, కార్యదర్శి లయన్ గెంటిల గంగాధర్, కోశాధికారి లయన్ పార్వతీ ప్రశాంత్, వ్యవస్థాపక సభ్యులు లయన్ పత్తి రాము, క్లబ్ క్లబ్ డైరెక్టర్లు, సభ్యులు లయన్స్ పుట్టి సాగర్, ఎండి శామీర్, ఒరికే సతీష్, డాక్టర్ మల్లేష్, భోజుగొండ అనిల్, బచ్చు శ్రావణ్, గ్రామ పెద్దలు ప్రజలు పాల్గొన్నారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం · తెలుగు దినపత్రిక
గురువారం 23 జూలై 2026

# ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు కేంద్రం కుట్ర

- రాహుల్ గాంధీని చూసి కేంద్ర ప్రభుత్వం భయపడుతోంది.
- లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో బీజేపీ చెలగాటం.
- నీట్ పేపర్ లీక్‌కు బాధ్యత వహిస్తూ కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలి.
- నీలం మధు ముదిరాజ్.







ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 22: (జన సంఘర్షణ)

దేశంలో ప్రజాస్వామ్యాన్ని పూడ్చిపెట్టి, ప్రశ్నించే ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీవ్ర కుట్రలు చేస్తోందని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ నీలం మధు ముదిరాజ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రజల తరఫున నిలబడి కేంద్రాన్ని నిలదీస్తున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రజాదరణను చూసి కేంద్ర ప్రభుత్వం భయపడుతోందని, అందులో భాగంగానే ఆయనతో పాటు ప్రతిపక్ష నేతలను అక్రమంగా అరెస్ట్ చేయిస్తోందని మండిపడ్డారు. రాహుల్ గాంధీతో పాటు ప్రతిపక్ష నాయకుల అక్రమ అరెస్టులను ఖండిస్తూ, నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో ఏఐసీసీ పిలుపు మేరకు, టీపీసీసీ అధ్యక్షులు శ్రీ మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన 'చలో లోక్ భవన్' నిరసన కార్యక్రమంలో నీలం మధు ముదిరాజ్ పాల్గొని మాట్లాడారు. నెక్లెస్ రోడ్‌లోని ఇందిరమ్మ విగ్రహం వద్దకు వేలాదిగా తరలివచ్చిన కాంగ్రెస్ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు యువతతో కలిసి ఆయన రాజ్ భవన్ వైపు భారీ ర్యాలీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా నీలం మధు ముదిరాజ్ మాట్లాడుతూ.. రాత్రింబవళ్లు కష్టపడి చదివిన లక్షలాది మంది నిరుపేద, మధ్యతరగతి విద్యార్థుల భవిష్యత్తుతో బీజేపీ ప్రభుత్వం దారుణంగా చెలగాటమాడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ చరిత్రలోనే ఎన్నడూ లేనివిధంగా నీట్ పేపర్ లీకేజీ కుంభకోణంతో విద్యార్థుల జీవితాలను అంధకారంలోకి నెట్టారని విమర్శించారు. ఈ దారుణమైన వైఫల్యానికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కక్షసాధింపు చర్యలతో ప్రతిపక్ష నాయకులను జైలుకు పంపినంత మాత్రాన కాంగ్రెస్ పోరాటాలను ఆపలేరని స్పష్టం చేశారు. విద్యార్థుల, నిరుద్యోగుల జీవితాలతో ఆడుకుంటున్న బీజేపీ ప్రభుత్వానికి రాబోయే రోజుల్లో దేశ ప్రజలు, యువత తగిన బుద్ధి చెప్పడం ఖాయమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, వీర్లపల్లి శంకర్, అంబర్ పేట్ ఇంచార్జ్ డాక్టర్ సి రోహిన్ రెడ్డి, ఫిషరీస్ చైర్మన్ మెట్టు సాయికుమార్, డీసీసీ అధ్యక్షులు మోత రోహిత్, ఎంపీలు,ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్ యుఐ శ్రేణులు, కాంగ్రెస్ నాయకులు, తదితరులు భారీగా పాల్గొన్నారు.

# మెదక్ జిల్లా కేంద్రంలోని రాందాస్ చౌరస్తా గాంధీ విగ్రహం వద్ద నరేంద్ర మోడీ దిష్టిబొమ్మ దగ్ధం

- లోక్ సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, ప్రతిపక్ష నాయకులను అరెస్టు చేయడం ఖండిస్తూ..
- నీట్ పేపర్ లీకు విషయంలో బాధ్యత వహించి కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రసాద్ రాజీనామా చేయాలని డిమాండ్.
- మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్.
- ఏఐసీసీ టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పిలుపుమేరకు నరేంద్ర మోడీ దిష్టిబొమ్మ, ధర్నా కార్యక్రమం చేపట్టారు.






ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 22 (జన సంఘర్షణ)

మెదక్ జిల్లా కేంద్రంలోని రాందాస్ చౌరస్తా మహాత్మా గాంధీ విగ్రహం వద్ద ఏఐసీసీ, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పిలుపు మేరకు లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, ప్రతిపక్ష నాయకులు అరెస్ట్‌ను ఖండిస్తూ, నీట్ పేపర్ లీక్‌కు బాధ్యత వహించి కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న డిమాండ్ చేస్తూ ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేసిన మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జంతర్ మంతర్ వద్ద విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్‌ని నిరసిస్తూ ప్రధాని నివాసం ఎదుట శాంతియుతంగా ఆందోళన చేపట్టిన లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రియాంకా గాంధీతో పాటు ఇతర కాంగ్రెస్ నాయకులను అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. జంతర్ మంతర్ వద్ద విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్ ఘటనపై స్వతంత్ర, నిష్పాక్షిక విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే నీట్ పరీక్ష నిర్వహణలో జరిగిన అవకతవకలు, పేపర్ లీకేజీపై కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని, నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని కోరారు. నీట్ పేపర్ లీకేజీ కారణంగా తీవ్ర మనోవేదనకు గురై ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలను కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని, పార్లమెంట్‌లో ఈ అంశంపై సమగ్ర చర్చ నిర్వహించి వాస్తవాలను దేశ ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. దేశ యువత భవిష్యత్తుతో చెలగాటం ఆడే చర్యలను కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదని, ప్రజాస్వామ్యంలో శాంతియుత నిరసనలు తెలిపే హక్కును హరించే చర్యలు దేశానికి మంచివి కావని అన్నారు.కేంద్ర ప్రభుత్వం నిర్బంధ రాజకీయాలను విడనాడి ప్రజాస్వామ్య విలువలను గౌరవించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు,పీసీసీ నాయకులు, డీసీసీ కార్యవర్గ సభ్యులు, మండల పార్టీ అధ్యక్షులు, మహిళా కాంగ్రెస్, ఎన్.ఎస్.యు.ఐ ,యువజన కాంగ్రెస్, అనుబంధ సంఘాల నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు, యువజనులు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొనారు.

# బాలలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు

- ఆపరేషన్ ముస్కాన్‌లో 78 మంది చిన్నారుల రక్షణ.
- జిల్లాలో 50 కేసుల నమోదు.
- ఆపరేషన్ ముస్కాన్ బృందాల సమస్యలు, సవాళ్లను అడిగి తెలుసుకున్న ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 22 (జన సంఘర్షణ)

నేటి బాలలే రేపటి భావి భారత పౌరులని, వారి బాల్యాన్ని పనులకు కాకుండా విద్యకు అంకితం చేయాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు అన్నారు. బాలల చేతుల్లో పనిముట్లు కాకుండా పుస్తకాలు ఉండేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. బాల కార్మిక వ్యవస్థ వల్ల దేశ భవిష్యత్తు అంధకారంగా మారే ప్రమాదం ఉందని, ప్రపంచంలో అత్యధిక యువ జనాభా కలిగిన దేశాల్లో భారత్ ముందంజలో ఉందని, ఈ యువతే దేశ భవిష్యత్తుకు బలమని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జూలై 1 నుంచి నిర్వహిస్తున్న ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోని హోటళ్లు, ఇటుక బట్టీలు, నిర్మాణ ప్రాంతాలు, దుకాణాలు,వ్యాపార సముదాయాల్లో పనిచేస్తున్న బాల కార్మికులను గుర్తించి వెంటనే రక్షించాలని అధికారులను ఆదేశించారు. రక్షించిన చిన్నారులను చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (సీడబ్ల్యూసీ) ముందు హాజరుపరిచి, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించి అప్పగించాలని సూచించారు. అవసరమైన సందర్భాల్లో సంరక్షణ గృహాలకు తరలించాలని తెలిపారు. ఆపరేషన్ ముస్కాన్ ప్రారంభమైన 20 రోజుల్లో జిల్లాలో 78 మంది చిన్నారులను రక్షించినట్లు ఎస్పీ తెలిపారు.




రక్షించిన చిన్నారులను సీడబ్ల్యూసీ ముందు హాజరుపరిచి, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించిన అనంతరం అప్పగించినట్లు పేర్కొన్నారు. బాల కార్మిక వ్యవస్థకు సంబంధించి జిల్లావ్యాప్తంగా 50 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. బాల కార్మికులను పనిలో పెట్టుకునే యజమానులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ సందర్భంగా ఆపరేషన్ ముస్కాన్ బృందాలు విధులు నిర్వహించే సమయంలో ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్లను ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించడం, బాల కార్మికులను గుర్తించడం, రక్షణ చర్యలు చేపట్టే సమయంలో ఎదురవుతున్న ఇబ్బందులను బృంద సభ్యులను అడిగి తెలుసుకున్నారు.విధుల్లో ఉన్న సమయంలో ఎలాంటి సమస్యలు లేదా ఇబ్బందులు ఎదురైనా వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని, అవసరమైన సహకారం అందిస్తామని ఎస్పీ సూచించారు. బాల కార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఎస్పీ పిలుపునిచ్చారు.బాలల భవిష్యత్తును కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని, బాలలతో పనులు చేయించే యజమానులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రజలు కూడా పోలీసు శాఖకు సహకరించాలని కోరారు. సమన్వయ సమావేశంలో మెదక్ డియస్పి ప్రసన్న కుమార్,డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ జార్జ్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ సతేంద్ర ప్రసాద్, విద్యా,వైద్య శాఖల అధికారులు, ఎన్‌జీవో ప్రతినిధులు, రెండు డివిజన్లకు చెందిన ఆపరేషన్ ముస్కాన్ బృందాల సభ్యులు పాల్గొన్నారు.

# మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో టీజీసీజీటిఏ ఎన్నికలు ఏకగ్రీవం

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 22 (జన సంఘర్షణ)



మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలంగాణ కళాశాల గెజిటెడ్ అధ్యాపకుల సంఘం (టీజీసీజీటిఏ) ఎన్నికలు బుధవారం ప్రశాంత వాతావరణంలో నిర్వహించగా, అన్ని పదవులకు ఏకగ్రీవంగా ఎన్నికలు జరిగాయి. ఈ విషయాన్ని ఎన్నికల అధికారి డాక్టర్ నాగేంద్రరావు అధికారిక వెల్లడించారు. ఈ ఎన్నికల్లో కళాశాల టీజీసీజీటిఏ అధ్యక్షురాలిగా వృక్ష శాస్త్ర విభాగ అధ్యాపకురాలు డాక్టర్ ఆర్. శ్రీలత, కార్యదర్శిగా వాణిజ్య శాస్త్ర విభాగ అధ్యాపకులు డాక్టర్ బి. శరత్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గానికి కళాశాల అధ్యాపకులు అభినందనలు తెలియజేస్తూ, వారి నాయకత్వంలో అధ్యాపకుల సంక్షేమం, విద్యా ప్రమాణాల అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు.ఎన్నికల సందర్భంగా నిర్వహించిన సమావేశంలో కళాశాల అధ్యాపకుల సంఘ ప్రాథమిక సభ్యులు సింహారెడ్డి, డాక్టర్ ప్రవీణ్ కుమార్, డాక్టర్ టి. మల్లేశం,డాక్టర్ తిరుమల రెడ్డి, పీ. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. వారు ఏకగ్రీవ ఎన్నికకు మద్దతు తెలుపుతూ అభ్యర్థులను బలపరిచారు. అనంతరం ఎన్నికల పత్రాలను ఎన్నికల అధికారికి సమర్పించారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షురాలు డాక్టర్ ఆర్. శ్రీలత, కార్యదర్శి డాక్టర్ బి. శరత్ రెడ్డి అధ్యాపకుల సమస్యల పరిష్కారం, కళాశాల అభివృద్ధి, విద్యా ప్రమాణాల పెంపు కోసం సమష్టిగా పనిచేస్తామని ఈ సందర్భంగా తెలిపారు. వారి ఎన్నికతో కళాశాల అధ్యాపకుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి.

# హవెలిఘనపూర్ మండల నేతలతో కంఠరెడ్డి తిరుపతి రెడ్డి చిట్‌చాట్

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 22 (జన సంఘర్షణ)




మెదక్ జిల్లా హవెలిఘనపూర్ మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకులతో జిల్లా నాయకుడు కంఠరెడ్డి. తిరుపతిరెడ్డి బుధవారం మెదక్ జిల్లా పార్టీ కార్యాలయంలో చిట్‌చాట్ నిర్వహించారు. మండలంలోని తాజా రాజకీయ పరిస్థితులు, ప్రజా సమస్యలు, పార్టీ సంస్థాగత బలోపేతంపై నాయకులతో అభిప్రాయాలు పంచుకున్నారు.గ్రామాల్లో ప్రజలతో మమేకమై వారి సమస్యలను ఎప్పటికప్పుడు పార్టీ దృష్టికి తీసుకురావాలని సూచించారు. పార్టీ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో మరింత విస్తృతంగా నిర్వహిస్తూ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.మండలంలో చేపట్టాల్సిన కార్యక్రమాలు, స్థానిక సమస్యల పరిష్కారంపై నాయకుల నుంచి సూచనలు, అభిప్రాయాలు తెలుసుకున్నారు.ఈసమావేశంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కసిరెడ్డి.మాణిక్య రెడ్డి, మండల సీనియర్ నాయకులు సతీష్ రావు, ఏడుపాయల దేవస్థానం మాజీ చైర్మన్ బాల గౌడ్, మహేంద్ర అండ్ మహేంద్ర మాజీ చైర్మన్ మదన్ మోహన్ రావు మండలానికి చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జిల్లా పర్యాటక అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలి

- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 22 (జన సంఘర్షణ)







మెదక్ జిల్లా పర్యాటక అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్లోని కలెక్టర్ ఛాంబర్ లో గత ఐదు రోజుల నుంచి పర్యాటక శాఖ ఆధ్వర్యంలో పర్యటించిన పర్యాటక కన్సల్టెంట్ శవంతి గుప్త, భువన్, జిల్లా పర్యాటకశాఖ అధికారి రమేష్, ఈ డి యం సందీప్ తదితరులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గత ఐదు రోజులుగా మెదక్ జిల్లా వ్యాప్తంగా నర్సాపూర్ అర్బన్ పార్క్,మెదక్ ఖిల్లా, మెట్ల బావి, బార కమాన్, పోచారం, వేల్పుగొండ తుంబురేశ్వర ఆలయం, చందంపేట, పాపన్నపేట కోటలు, కోముటూరు మజీద్, లను పరిశీలించి, వారి అనుభవాలను పర్యాటకశాఖ కన్సల్టెంట్ శవంతి గుప్త,భవన్ లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా కలెక్టర్, జిల్లా అధికారులకు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఉన్న పర్యాటక ప్రాంతాలను వారసత్వ, ఆధ్యాత్మిక,పర్యావరణ, ప్రదేశాలుగా విభజించి జిల్లా పర్యాటక అభివృద్ధి కోసం సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వానికి నివేదించాలన్నారు. నివేదికలు సిద్ధం చేయాలని, అధికారులను ఆదేశించారు. జిల్లాలో అందరి సహకారంతో టూరిస్ట్ హబ్ గా తీర్చిదిద్దాలన్నారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లను ఆకస్మికంగా తనిఖీ

◆ భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,భద్రాచలం నియోజకవర్గం, జులై 22(జనసంఘర్షణ):



చర్ల మండలంలోని పెద్ద మేడిసిలేరు ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల, పెద్ద మేడిసిలేరు ఆశ్రమ హైస్కూల్, అలాగే చిన్న మేడిసిలేరు ఆశ్రమ పాఠశాలలను భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలు, హాస్టళ్లలో విద్యార్థులకు అందిస్తున్న ఆహారం నాణ్యత, విద్యా బోధన, వసతి సౌకర్యాలు, కిచెన్ గదుల పరిశుభ్రత తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అలాగే ఉపాధ్యాయులు, సిబ్బందికి విద్యార్థులకు మెరుగైన విద్య, పోషకాహారం, పరిశుభ్రమైన వాతావరణం కల్పించేలా పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రైతుల ఆందోళనకు స్పందించిన శాసనసభ్యులు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చర్ల మండలం, జులై 22(జనసంఘర్షణ):



చర్ల మండలంలోని రైతులకు తాళి పేరు ప్రాజెక్టు ద్వారా రైట్ కెనాల్,లెఫ్ట్ కెనాల్ గేట్లు లేపి చర్ల మండలం, దుమ్ముగూడెం మండలాల,రైతులకు నీళ్లు అందించాలని బిఆర్ఎస్ పార్టీ, సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేసిన రైతులు.చర్ల మండల పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు రైతుల ఆందోళన చూసి వెంటనే గేట్లు లేపి రైతులకు నీళ్లు ఇవ్వాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చర్ల బిఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ దొడ్డి తాతారావు కో కన్వీనర్ అయినవోలు పవన్ కుమార్ పార్టీ సీనియర్ నాయకులు గొర్ల రాజబాబు, పంజ రాజు,కాకి అనిల్,ఏనుటి జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## కావేరి స్టీల్ యాజమాన్యం సహకారంతో రోడ్డు మరమ్మతులు

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 22 (జన సంఘర్షణ)




గ్రామీణ స్థాయి రహదారుల మరమ్మత్తుల కోసం కోసం కావేరి స్టిల్ యాజమాన్యం ముందుకు వచ్చింది.మెదక్ మండలం తిమ్మాపూర్ గ్రామానికి వెళ్లే రహదారి ఇటీవల కురిసిన వర్షాలకు పూర్తిగా బురదమయంగా మారి, వాహనదారులు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చిన్నపాటి వర్షానికే రోడ్డు బురదగా మారడంతో రాకపోకలు కష్టతరమయ్యాయిరాయినిపల్లి గ్రామం నుంచి మక్తా భూపతిపూర్‌కు చదువుకోవడానికి వెళ్లే విద్యార్థులు కూడా ఈ రహదారినే ఉపయోగిస్తారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు కుంగిపోవడంతో విద్యార్థులతో పాటు గ్రామస్తులు తీవ్ర అవస్థలు పడ్డారు. అలాగే రాయినిపల్లి గ్రామ రైతులు తమ వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు కూడా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సమస్యను రాయినిపల్లి సర్పంచ్ రాజు, గ్రామ పెద్దలు కలిసి చిన్న శంకరం పేట్ మండలం లోని ఖాజాపూర్‌లోని కావేరి స్టీల్ పరిశ్రమ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై వెంటనే స్పందించిన పరిశ్రమ యాజమాన్యం మంగళవారం దెబ్బతిన్న రహదారికి మరమ్మతులు చేపట్టి, మురుగు మరియు బురదను తొలగించి రాకపోకలకు అనుకూలంగా మార్చింది.దీంతో రైతులు, విద్యార్థులు, వాహనదారులు ఊరట చెందారు. సమస్యపై వెంటనే స్పందించి రహదారిని బాగు చేసిన కావేరి స్టీల్ పరిశ్రమ యాజమాన్యానికి రాయినిపల్లి గ్రామస్తులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా యాజమాన్యం మాట్లాడుతూ... పరిశ్రమ చుట్టూ ఉన్న గ్రామాలే కాకుండా, ఇతర గ్రామాల్లో సైతం ప్రజలకు మౌలిక వసతులు కల్పించాడినికి కావేరి స్టీలు పరిశ్రమ ముందు ఉంటుందని యాజమాన్యం తెలిపారు ఈ మేరకు గ్రామస్తులు యాజమాన్యంకు కృతజ్ఞతలు తెలియ జేశారు.

## ప్రజల మధ్యే రాములన్న.. చీమలపాడు ప్రాంతంలో విస్తృత పర్యటన

◆ పలు కుటుంబాలకు పరామర్శ
◆ దశదిన కర్మకు హాజరై నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే లావుడియా రాములు నాయక్

సింగరేణి ప్రతినిధి: (జన సంఘర్షణ)

వైరా మాజీ ఎమ్మెల్యే లావుడియా రాములు నాయక్ బుధవారం మండల పరిధిలోని చీమలపాడు, పాటిమీద గుంపు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలు తెలుసుకున్న రాములు నాయక్, ఎప్పటికీ ప్రజలకు అండగా ఉంటానని భరోసా కల్పించారు. గ్రామాల్లో పర్యటించిన సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు ఆయనను కలిసి "సార్.. మళ్లీ మీరే రావాలి" అంటూ తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అనంతరం పాటిమీద గుంపు గ్రామానికి చెందిన సొసైటీ డైరెక్టర్, ఆర్ఎంపీ పోతురాజు రమేష్ తండ్రి పోతురాజు కృష్ణయ్య దశదిన కర్మ కార్యక్రమానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే, కృష్ణయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

అలాగే చీమలపాడు గ్రామానికి చెందిన పాటి కోటయ్య అనారోగ్యంతో ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. తదుపరి ఇటీవల మరణించిన బసవ రాంబాబు చిత్రపటానికి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులను ఓదార్చి తన సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైరా మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ ముత్యాల సత్యనారాయణ, గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పిట్టల నాగేశ్వరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి అనంతరపు వెంకటచారి, సొసైటీ వైస్ చైర్మన్, సర్పంచ్ ధారావత్ మంగీలాల్, మాజీ ఎంపీటీసీ ధరంసోత్ శంకర్, మాజీ సర్పంచ్‌లు మాలోత్ కిషోర్, బానోత్ శంకర్, మౌనిక, రాంజీ, మాజీ మండల ప్రధాన కార్యదర్శి అజ్మీర వీరన్న, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ వాంకుడోత్ నరేష్తో పాటు పాటి శ్రీను, అజ్మీర భిక్కులాల్, బానోత్ ప్రసాద్, వీరబాబు, ధారావత్ ఫూల్‌సింగ్, ఇస్లావత్ రాజాకుమార్, శీలంశెట్టి రాంబాబు, వెంకన్న, పాటి రమేష్, గుగులోతు హారు, భూక్య రాంకిషోర్ తదితరులు పాల్గొన్నారు.



## నేడు లీల గ్రూప్ చైర్మన్ డాక్టర్ మోహన్ నాయక్ రాక

◆ బాధితులను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేత.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 22: (జన సంఘర్షణ)



లీలా గ్రూప్ చైర్మన్ డాక్టర్ మోహన్ నాయక్ గురువారం మెదక్ పట్టణంతోపాటు పలు మండలాలలో గుండెపోటు, ఆర్థికంగా లేక అనారోగ్యాలతో మృతి చెందిన కుటుంబాలను పరామర్శించి, వారి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేయడం కోసం రావడం జరుగుతుందని లీలా గ్రూప్ గ్రూప్ చైర్మన్ డాక్టర్ మోహన్ నాయక్ తెలిపారు. మెదక్ జిల్లా హవేల్ ఘన్పూర్ మండలంలోని శివాయపల్లి, ముత్తయ్యపల్లి, చౌట్లపల్లి గ్రామాలలో బాధితులకు ఆర్థిక సహాయం అందజేయడం జరుగుతుందన్నారు.

## తల్లిదండ్రుల బాధ్యత పిల్లలదే

◆ జిల్లా సంక్షేమ అధికారిహేమ భార్గవి.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 22(జన సంఘర్షణ)



వృద్ధులను వేధిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా సంక్షేమ అధికారి హేమభార్గవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఇటీవల వృద్దులపై శారీరక దాడులు,మానసిక వేధింపులు,ఆర్థిక దోపిడీ,ఆస్తి కోసం ఒత్తిడి చేయడం,ఇంటి నుండి వెళ్లగొట్టడం వంటి ఘటనలు పెరుగుతున్నట్లు తెలిపారు.ఇది మానవత్వానికి, కుటుంబ విలువలకు చట్టానికి విరుద్ధమైన చర్యగా పేర్కొన్నారు. పిల్లలు చట్ట ప్రకారం తల్లిదండ్రుల పోషణ, వైద్య సంరక్షణ, సంక్షేమం కల్పించాల్సిన బాధ్యత ఉందన్నారు. వృద్దులను వేధించడం, కొట్టడం చట్టప్రకారం నేరమన్నారు. ఆస్తికోసం హింసించడం వంటివి చేపడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

## కేసీఆర్ ఆనవాళ్లు చెరిపేయాలనే కుట్ర..

◆ పల్లె ప్రకృతి వనంలో వీవో భవనం ఎందుకు
◆ ప్రజలకు ఊపిరితిత్తుల్లాంటి పల్లె ప్రకృతి వనాన్ని కాపాడాలి
◆ బీఆర్ఎస్ నేత మండవ సత్యనారాయణ
◆ లేకపోతే గ్రామ ప్రజలతో కలిసి ఆందోళన తప్పదు అంటూ హెచ్చరిక

22-7-2026 జన సంఘర్షణ



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం గండుగుల్లపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ఉన్న పల్లె ప్రకృతి వనాన్ని తొలగించి వివో భవన నిర్మాణం. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల ఆనవాళ్లు కనిపించకుండా చేయాలనే ఉద్దేశంతో పల్లె ప్రకృతి వనంలో వీవో కార్యాలయ భవన నిర్మాణాన్ని చేపట్టడం తీవ్రంగా ఖండనీయమని బీఆర్ఎస్ మండల మాజీ యువజన అధ్యక్షుడు మండవ సత్యనారాయణ తీవ్రస్థాయిలో విమర్శించారు. ఆయన విడుదల చేసిన పత్రికా ప్రకటనలో మాట్లాడుతూ, గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన వాతావరణం, పచ్చదనం, విశ్రాంతి కల్పించాలనే లక్ష్యంతో కేసీఆర్ ప్రభుత్వం ప్రతి గ్రామంలో పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. అలాంటి ప్రజోపయోగ స్థలాలను ఆక్రమించి భవనాలు నిర్మించడం ప్రజా ప్రయోజనాలకు విరుద్ధమని అన్నారు. గ్రామంలోని ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యే, మంత్రి కలిసి ఉద్దేశపూర్వకంగానే పల్లె ప్రకృతి వనంలో వీవో కార్యాలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారని ఆరోపించారు. వీవో కార్యాలయం గ్రామ మధ్యలో నిర్మిస్తే ప్రజలకు సులభంగా అందుబాటులో ఉంటుందని, అదే ప్రజల అభిప్రాయమని పేర్కొన్నారు. ప్రజల అభీష్టాన్ని గౌరవించి పల్లె ప్రకృతి వనంలో జరుగుతున్న వీవో భవన నిర్మాణాన్ని తక్షణమే నిలిపివేయాలని ప్రభుత్వం, సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

**పంచాయతీ సెక్రెటరీ షేక్ భాష వివరణ కోరగా**

నేను వచ్చి వారం రోజులే అయినది నాకు దానికి ఎటువంటి సంబంధం లేదని నాపై అధికారులు కనుక్కుంటానని సమాధానం ఇచ్చారు. లేదంటే గ్రామ ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమం చేపట్టి ఆందోళనకు దిగుతామని మండవ సత్యనారాయణ హెచ్చరించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పల్లె ప్రకృతి వనాన్ని పరిరక్షించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## మండల రైతులకు సాగునీరు అందించడంలో ప్రభుత్వ నిర్లక్ష్యం తగదు

◆ సీపీఎం చర్ల మండల కమిటీ

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చర్ల మండలం, జులై 22(జనసంఘర్షణ):

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చర్ల మండలం సత్యనారాయణపురంలో సుమారు 1,200 మంది రైతులు సమావేశమై మండలంలోని రైతులకు తక్షణమే సాగునీరు అందించాలని ప్రభుత్వాన్ని సిపిఎం మండల కార్యదర్శి మచ్చా రామారావు కోరారు. ఈ సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు రైతుల సమస్యలను విని, నీరు అందేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అయితే, వర్షపాతం వల్ల వచ్చే నీటిని మాత్రమే అందించే విధంగా చేసిన వ్యాఖ్యలు రైతుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి.

వ్యవసాయానికి శాశ్వత పరిష్కారం చూపకుండా, వర్షాలపై మాత్రమే ఆధారపడే విధానం సరైనది కాదని రైతులు పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే సాగునీటి నిల్వకు చర్యలు చేపట్టి, రైతులకు నిరంతర నీటి సరఫరా జరిగేలా ప్రణాళికలు రూపొందించాలి. ప్రత్యేకంగా తాలిపేరు ప్రాజెక్టు నుంచి వచ్చే కాలువలను వెంటనే మరమ్మతులు చేసి, అవసరమైన చోట పూడిక తొలగింపు, లీకేజీల నివారణ వంటి పనులు పూర్తి చేయాలి, నీటిని వృథా కాకుండా నిల్వ ఉంచి, మండలంలోని అన్ని ఆయకట్టు ప్రాంతాలకు సాగునీరు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. రైతుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే, రైతు సంఘాలు, ప్రజాసంఘాలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరిస్తున్నాము. ఈ కార్యక్రమం లో చర్ల మండల రైతు సంఘం నాయకులు కనితి రామారావు,సొంది నారాయణ, శ్రీరాములు తదితరులు పాల్గున్నారు.






జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం | తెలుగు దినపత్రిక
గురువారం
23 జూలై 2026

# బిఆర్ఎస్ పాలనలో జరిగిన నిర్బంధాలను మర్చిపోయి పద్మా దేవేందర్ రెడ్డి మాట్లాడడం విడ్డూరం

- **బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగి రాములు.**

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 22 (జన సంఘర్షణ)

ఢిల్లీలో జరిగిన సంఘటనల నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగి రాములు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులపై లాఠీచార్జీల గురించి మాట్లాడే ముందు టీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన సంఘటనలను ఒకసారి గుర్తు చేసుకోవాలని సూచించారు. పదేళ్ల టీఆర్ఎస్ పాలనలో విద్యా వ్యవస్థను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని, తమ న్యాయమైన హక్కుల కోసం పోరాడిన విద్యార్థులపై పోలీసు కేసులు నమోదు చేసి వేధించిన ఘటనలను తెలంగాణ ప్రజలు ఇంకా మర్చిపోలేదన్నారు.ఆర్టీసీ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల కోసం సమ్మె చేపట్టిన సమయంలో అప్పటి ప్రభుత్వం వ్యవహరించిన తీరు అత్యంత దురదృష్టకరమని, ఆ ఉద్యమ సమయంలో అనేక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాయని గుర్తు చేశారు.పదేళ్ల పాలనలో నిరుద్యోగులకు తగిన ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వకుండా వారి భవిష్యత్తుతో ఆటలాడిందని విమర్శించారు.పరీక్షల నిర్వహణలో జరిగిన పేపర్ లీకేజీలు ,ఇతర అవకతవకలు రాష్ట్ర ప్రతిష్టను దెబ్బతీశాయని, వాటిపై ప్రజల్లో తీవ్ర ఆందోళన నెలకొన్న విషయాన్ని గుర్తుచేశారు. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ప్రయత్నించిన వారిపై జరిగిన దాడులు, ప్రజలపై పోలీసు నిర్బంధాలు, ప్రజాస్వామ్య హక్కులను అణిచివేసిన సంఘటనలు టీఆర్ఎస్ పాలనలోనే చోటుచేసుకున్నాయని పేర్కొన్నారు. అలాంటి పాలనను ప్రజా పాలనగా కాకుండా నిర్బంధ పాలనగా ప్రజలు గుర్తుంచుకున్నారని అన్నారు.ఢిల్లీ ఘటనపై మాట్లాడుతున్న పద్మా దేవేందర్ రెడ్డి, గతంలో తమ ప్రభుత్వం హయాంలో జరిగిన నిర్బంధ చర్యలపై కూడా అదే స్థాయిలో స్పందించి ఉంటే ప్రజలు నమ్మేవారని అన్నారు. గతాన్ని పూర్తిగా విస్మరించి ఇప్పుడు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడడం మొసలి కన్నీరు కార్చినట్లేనని విమర్శించారు. నీట్ పరీక్షలకు సంబంధించిన అవకతవకలపై కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే దర్యాప్తు జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుందని, సంబంధిత అధికారులను అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. జరిగిన తప్పులను ప్రభుత్వం దాచిపెట్టలేదని, బాధ్యులపై చర్యలు తీసుకున్న విషయాన్ని కూడా గుర్తించాలన్నారు.ప్రధానమంత్రి నివాసాన్ని ముట్టడించేలా ఉద్యమాలకు ప్రోత్సాహం ఇవ్వడం ప్రజాస్వామ్య పద్ధతి కాదని, రాజకీయ లబ్ధి కోసం దేశ ప్రతిష్టను దెబ్బతీసే ప్రయత్నాలను ఎవరూ సమర్థించకూడదని అన్నారు. జాతీయ భద్రతకు సంబంధించిన అంశాలపై సంబంధిత సంస్థలు తమ విధి ప్రకారం దర్యాప్తు చేస్తున్నాయని పేర్కొన్నారు వాస్తవాలను పక్కనపెట్టి ప్రజలను తప్పుదారి పట్టించే వ్యాఖ్యలు చేయడం మానుకుని, బాధ్యతాయుతంగా మాట్లాడాలని పద్మా దేవేందర్ రెడ్డికి రాగి రాములు సూచించారు. దేశ ప్రయోజనాలు, ప్రజాస్వామ్య విలువలు, చట్టబద్ధ వ్యవస్థల పట్ల ప్రతి ఒక్కరూ గౌరవం చూపాలని,భారతీయ జనతా పార్టీ ఎల్లప్పుడూ దేశ ప్రయోజనాల పరిరక్షణకే కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు.



# ప్రైవేటు పాఠశాలలపై దౌర్జన్యాలకు పాల్పడితే చర్యలు తప్పవు

హైదరాబాద్ సిటీ, కూకట్పల్లి ప్రతినిధి అంజిబాబు, జూలై 22, (జన సంఘర్షణ):

ప్రైవేట్ పాఠశాలలపై దౌర్జన్యాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ట్రస్మా నాయకులు మల్కాజ్గిరి పోలీస్ కమిషనర్ సుమతికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆమెకు సంఘం ప్రతినిధి బృందం వినతి పత్రాన్ని అందజేసింది. విద్యార్థి సంఘాల పేరుతో, కుల సంఘాల పేరుతో, ఆర్టిఐ యాక్టివిష్టుల పేరుతో పాఠశాల నిర్వాహకులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని వారు వాపోయారు. డబ్బు వసూలే ప్రధానంగా ఇలాంటివారు పాఠశాలల నిర్వహకులను ఇబ్బంది చేస్తున్న విషయాన్ని ఆమె దృష్టికి తీసుకువచ్చారు. తాజాగా ఉప్పల్ ప్రాంతంలో కొందరిపై కేసులు నమోదు అయినట్లు కూడా ఆమెకు తెలిపారు. కఠిన చర్యలు తీసుకుంటూ వసూళ్లకు పాల్పడుతున్నటువంటి వారి పట్ల కఠిన చర్యలు తీసుకుంటామని మల్కాజ్గిరి పోలీస్ కమిషనర్ సుమతి తమకు స్పష్టమైన హామీని ఇచ్చారని వారు ఈ సందర్భంగా తెలిపారు. పాఠశాల నిర్వహకుల పట్ల అనుచితంగా వ్యవహరిస్తున్న వారిని ఉపేక్షించవద్దని సూచించారు. ఎవరు డబ్బులు డిమాండ్ చేసిన వెంటనే పోలీసులను సంప్రదించి ఫిర్యాదు చేయాలని ట్రస్మా సభ్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎస్ ఎన్ రెడ్డి, అసోసియేట్



అధ్యక్షులు రామేశ్వర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బిరు ఆంజనేయులు, ఉప్పల్ అధ్యక్షులు వెంకటేశ్వరరావు, పలు పాఠశాలల కరస్పాండెంట్స్ కిరణ్ కుమార్ రెడ్డి, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల గొంతును అణచివేయడం ఎవరి తరం కాదు

- **యువత భవిష్యత్తు కోసం కాంగ్రెస్ పోరాడుతుంది**
- **ప్రధాన ప్రతిపక్ష, కాంగ్రెస్ నేతల అరెస్ట్ అప్రజాస్వామికం, దుర్మార్గం, ప్రజాస్వామ్య హక్కులపై దాడి.**
- **పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం.**

హైదరాబాద్ సిటీ, కూకట్పల్లి ప్రతినిధి అంజిబాబు, జూలై 22, (జన సంఘర్షణ):

శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై కేంద్ర ప్రభుత్వం ప్రదర్శించిన దౌర్జన్యాన్ని, అలాగే విద్యార్థులకు మద్దతుగా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రధాని నివాసం వద్ద నిరసన తెలిపిన కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ తదితర ప్రతిపక్ష నాయకులను అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తూ, అలాగే నీట్ ప్రశ్నాపత్రం లీక్ వ్యవహారంలో నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐసీసీ పిలుపు మేరకు టీపీసీసీ ఆదేశాలతో నెక్లెస్ రోడ్ నుంచి లోక్ భవన్ వరకు నిర్వహించిన నిరసన ర్యాలీలో పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం. పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ.. జంతర్ మంతర్ వద్ద విద్యార్థులపై లాఠీచార్జీ ఘటనపై స్వతంత్ర, నిష్పాక్షిక విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కోవిడ్ నిర్వహణలో లోపాలు, పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం, రైతు వ్యతిరేక చట్టాలు, వరుస ప్రశ్నపత్రాల లీకేజీలు, ఎన్నికల వ్యవస్థపై తలెత్తిన సందేహాలు ప్రజలకు సంబంధించిన ప్రతి కీలక అంశంపై రాహుల్ గాంధీ నిరంతరం కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ వచ్చారు. ఇప్పుడు లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం చేసిన నీట్ లీకేజీపై కూడా ఆయన గళమెత్తడం ప్రజాస్వామ్యబద్ధమైన బాధ్యత. ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన ప్రభుత్వం, ప్రశ్నించే వారిని అరెస్టు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తిని దెబ్బతీసే చర్య. నీట్ లీకేజీపై పారదర్శక దర్యాప్తు జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహిస్తూ వెంటనే రాజీనామా చేయాలి డిమాండ్ చేసారు. నీట్ పేపర్ లీకేజీ కారణంగా తీవ్ర



మనోవేదనకు గురై ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలను కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలి. పార్లమెంట్లో నీట్ పేపర్ లీకేజీ అంశంపై సమగ్ర చర్చ నిర్వహించి, వాస్తవాలను దేశ ప్రజలకు తెలియజేయాలి. దేశ యువత భవిష్యత్తుతో చెలగాటం ఆడే చర్యలను కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదు. విద్యార్థుల గొంతును అణచివేయడం కాదు, వారి సమస్యలకు పరిష్కారం చూపడమే ప్రభుత్వ బాధ్యత అని అన్నారు.

# శేరిలింగంపల్లి నియోజకవర్గ ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై సమీక్షా సమావేశం

- **31వ తారీకు లోగా బీజేపీ సానుభూతి ఓటర్ల ఎన్యూమరేషన్ ఫార్మ్స్ పూర్తి చేసి బి.ఎల్.ఓ లకు అందజేయాలి**
- **మాజీ మంత్రి బీజేపీ తెలంగాణ రాష్ట్ర ఎస్ ఐ ఆర్ కన్వీనర్ మర్రి శశిధర్ రెడ్డి.**
- **రాష్ట్ర, జిల్లా నాయకులు, కంటెస్టెడ్ కార్పొరేటర్లు, పోటీ చేయాలనుకునే ప్రతి ఒక్కరూ మీ డివిజన్ల లోని బి.ఎల్. ఏ లకు అందుబాటులో ఉంటూ వారికి అండగా ఉండాలి.**
- **బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జి రవికుమార్ యాదవ్.**

హైదరాబాద్ సిటీ, శేరిలింగంపల్లి ప్రతినిధి అంజిబాబు, జూలై 22, (జన సంఘర్షణ):

మియాపూర్ భూమి బ్యాంక్వేట్ హాల్ లో నిర్వహించిన శేరిలింగంపల్లి నియోజకవర్గ ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ సమీక్షా సమావేశంలో మాజీ మంత్రి మర్రి శశిధర్ రెడ్డి జోన్ 3 ఇంచార్జి ఇంద్రసేన్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జి రవికుమార్ యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మహిపాల్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అజిత్, రాష్ట్ర ప్రొఫెషనల్ సెల్ కన్వీనర్ బాల్దా అశోక్, మహిళా మోర్చా కార్యదర్శి పద్మ, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కేశవ రావు, జిల్లా ఇంచార్జి ఆలే భాస్కర్, శేరిలింగంపల్లి నియోజకవర్గ బి.ఎల్.ఏ 1 మాణిక్ రావు ఎస్ ఐ ఆర్ కార్యక్రమంలో బీజేపీ బి.ఎల్.ఏ చేపట్టవలసిన



కార్యాచరణ పై దిశా నిర్దేశం చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బి.ఎల్.ఓ లతో పాటు మన బీజేపీ పార్టీ బి. ఎల్. ఏ లు వారికి అందుబాటులో ఉంటూ బాగా పనిచేస్తున్నారని కొనియాడారు. ఇప్పటి వరకు కొండాపూర్ 43.15 శాతం,లింగంపల్లి 43.38 శాతం, భారతి నగర్ 45.12 శాతం, గచ్చిబౌలి 44.61 శాతం, మాదాపూర్ 43.64 శాతం, చందా నగర్ 45.79 శాతం, మియాపూర్ 41.95 శాతం, హఫీజ్ పేట్ 42.35 శాతం, హైదర్ నగర్ 44.01 శాతం , ఆల్విన్ కాలనీ 43.53 శాతం , వివేకానంద నగర్ 45.48 శాతం , పాపిరెడ్డి నగర్ 43.07 శాతం అంటే మన శేరిలింగంపల్లి నియోజకవర్గంలో దాదాపు 44 శాతం 3,37,887 లక్షల ఓటర్లు ఎన్యూమరేషన్ ఫామ్ అధికారులకు అందజేయడం జరిగిందని దీని వెనక మన బీజేపీ బి.ఎల్.ఏ ల కృషి చాలా ఉందన్నారు. అలాగే మన బి.ఎల్.ఏ లు ఈ నెల 31 లోగా మనకు సపోర్టర్స్ ,మన బీజేపీ సానుభూతి ఓటర్లు ఎవరైనా ఉంటే వాళ్ళతో ఎన్యూమరేషన్ ఫార్మ్స్ పూర్తి చేయించి అధికారులకు అందచేయాలన్నారు, ఒకే ఇంట్లో ఉంటున్న ఫ్యామిలీ వేరే వేరే బూత్ లలో ఉన్న ప్రతి ఓటు ఆగస్టు 3 తర్వాత నుండి ఫామ్ 8 ద్వారా అదే బూత్ లో వచ్చేలా చేయించాలని, మనకు డ్రాఫ్ట్ ఓటర్ జాబితా వచ్చిన తర్వాత నుండి కొత్త ఓటర్లు 18 సంవత్సరాల పైన వారికి ఓట్లు నమోదు చేయించాలని, మన బీజేపీ సానుభూతిపరులుగా ఉన్న వారికి ఫామ్ 8 ద్వారా ఓటర్లు మన శేరిలింగంపల్లి అసెంబ్లీ పరిధిలోకి ఓట్లు మార్చుకునేల ఒప్పించాలని తెలిపారు. ప్రతి రోజు బి.ఎల్.ఏ లు వారి బి.ఎల్.వో వద్ద నుండి ఈరోజు ఎన్ని ఫామ్స్ రిటర్న్ వచ్చాయి, ఇంకా ఎన్ని పెండింగ్ ఉన్నాయో తెలుసుకుని నాయకులకు అందజేయాలన్నారు, నాయకులు, కంటెస్టెడ్ కార్పొరేటర్లు,పోటీ చేయాలనుకునే ప్రతి ఒక్కరూ మీ డివిజన్ల లో బి.ఎల్. ఏ లకు అందుబాటులో ఉంటూ వారికి అండగా ఉండాలన్నారు. బి.ఎల్.ఏ లు లేని బూత్ లలో మన నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక దృష్టి పెట్టి తిరగాలని దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో మహిపాల్ రెడ్డి, అశోక్ కురుమ, అజిత్, కేశవరావు, మాణిక్ రావు, అనిల్ గౌడ్, భాస్కర్ రెడ్డి, పద్మ, వసంత్ యాదవ్, రామరాజు, సీతారామరాజు, విజయేందర్ తదితరులు పాల్గొన్నారు.

# రుద్రూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకుల నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమం

రుద్రూర్: జూలై 22( జన సంఘర్షణ)




నిజామాబాద్ జిల్లా రుద్రూర్ మండల కేంద్రంలో ఈరోజు ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును నిరసిస్తూ రుద్రూర్ మండల కేంద్రంలో బుధవారం కాంగ్రెస్. నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి ఆందోళన చేపట్టారు విద్యార్థుల ఆందోళనకు మద్దతు తెలుపుతూ కాంగ్రెస్ పార్టీ అగ్ర నేత లోక్సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ ప్రధాన రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు నిరసన కార్యక్రమంలో రుద్రూర్ గ్రామ సర్పంచ్ చందూర్ సునీత చంద్రశేఖర్. బాన్సువాడ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇందూర్ చంద్రశేఖర్. రుద్రూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అరుణ్ కుమార్. కర్కే అశోక్. పార్వతి ప్రవీణ్. పత్తి రాము. ఉప సర్పంచ్ నిసార్. రానంపల్లి కొండలవాడి శంకర్. సర్పంచ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు చింతల శ్రీనివాస్. రాజా గౌడ్. కాసుల ఉమా మహేష్. బొప్పాపూర్ కృష్ణ. గాండ్ల శీను. గాంధీ. కాంగ్రెస్ నాయకులు తదితరులు. ధర్నా కార్యక్రమంలో పాల్గొన్నారు.

# మీ ఓటు మీ ప్రజాస్వామ్య హక్కు మాత్రమే కాదు..దేశ భవిష్యత్తును నిర్ణయించే మీ అమూల్యమైన స్వరం

- **టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి జగదీశ్వర్ గౌడ్.**

హైదరాబాద్ సిటీ, శేరిలింగంపల్లి ప్రతినిధి అంజిబాబు, జూలై 22, (జన సంఘర్షణ):



బుధవారం రోజు శంశీగూడ డివిజన్ పరిధిలోని శంశీగూడ నందు నిర్వహిస్తున్న "సర్" కార్యక్రమంలో భాగంగా బీఎల్ఓ లు,కాంగ్రెస్ పార్టీ పార్టీ బిఎల్ఏ లు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి పాల్గొన్ని వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. "సర్" కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాల్గొనాలని, మీ పేరు ఓటరు జాబితాలో నమోదై ఉందో లేదో తప్పనిసరిగా పరిశీలించుకోవాలని, ప్రతి అర్హత కలిగిన పౌరుడు తన ఓటరు నమోదు వివరాలు సరైనవిగా, తాజాగా ఉన్నాయో లేదో నిర్ధారించుకోవాలని కోరారు. శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్గా, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ప్రజలందరూ ప్రత్యేక ఓటరు జాబితా సవరణలో పాల్గొనాలని శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ ప్రజలకు,ముఖ్యంగా యువతకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు పట్వారి శశిధర్, ప్రభాకర్, భీమ్రావు, శ్రీనివాస్, బాబు, వెంకట్, మల్లేష్, వీరన్న, రాజన్న, నర్సింగ్రావు, సుబ్బు, చింటూ, దర్శన్, భూమన, దయాకర్, ప్రవీణ్, దశరథ్, నాగేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, కొండయ్య, జగదీష్, కృష్ణ, మహిళా కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షురాలుశ్రీదేవి, నాయకులు లలిత, కృష్ణవేణి, లక్ష్మి, యాదమ్మ, మమత, డి లక్ష్మి, అర్చన, శ్రీదేవి, భాగ్య తదితరులు పాల్గొన్నారు.

# శంషిగూడ డివిజన్‌లో సర్ ఓటు మ్యాపింగ్ కార్యక్రమాన్ని పరిశీలించిన దొడ్ల వెంకటేష్ గౌడ్

హైదరాబాద్ సిటీ, శేరిలింగంపల్లి ప్రతినిధి అంజిబాబు, జూలై 22, (జన సంఘర్షణ):



శేరిలింగంపల్లి నియోజకవర్గం శంషిగూడ డివిజన్ పరిధిలోని జరుగుతున్న సర్ ఓటు మ్యాపింగ్ కార్యక్రమాన్ని డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ స్థానిక నాయకులతో కలిసి పరివేక్షించడం జరిగింది. ఈ సందర్భంగా వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న యస్ ఐ ఆర్ కార్యక్రమంలో ప్రతి అర్హత కలిగిన ఓటరు తప్పనిసరిగా భాగస్వామి కావాలని కోరారు. బిఎల్ఓలు అందజేసే ఎమ్యూనరేషన్ ఫారంలో తమ పూర్తి వివరాలను సక్రమంగా నమోదు చేసి ఓటు హక్కును పరిరక్షించుకోవాలని సూచించారు, బూతు లెవెల్ అధికారులు సర్ కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. అదేవిధంగా ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఉన్న ఓట్లను గుర్తించి తొలగించేందుకు బిఎల్ఓలు కృషి చేయాలని, నకిలీ ఓట్లను పూర్తిగా తొలగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయాలంటే ప్రతి అర్హత కలిగిన పౌరుడు ఓటరుగా నమోదు కావడం అత్యంత ముఖ్యమని పేర్కొంటూ, స్థానిక నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్, శివ, బీఎల్ఏలు తదితరులు పాల్గొన్నారు.

# కేటీఆర్ జన్మదినం సందర్భంగా ఘనంగా అన్నదాన కార్యక్రమం

కోటగిరి, జూలై 22 (జన సంఘర్షణ):
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) జన్మదినాన్ని పురస్కరించుకుని కోటగిరి మండల కేంద్రంలో శుక్రవారం ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించడంతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు బీఆర్ఎస్ మండల నాయకులు తెల్ల రవికుమార్ తెలిపారు. బుధవారం కోటగిరి మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేటీఆర్ జన్మదిన వేడుకలను శుక్రవారం ఉదయం 10:30 గంటలకు అంబేద్కర్ చౌరస్తా వద్ద కేక్ కటింగ్‌తో ప్రారంభించనున్నట్లు తెలిపారు. అనంతరం స్వీట్ల పంపిణీతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కోటగిరి మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తమ తమ గ్రామాల్లో కేటీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించి, అనంతరం మండల కేంద్రంలో జరిగే కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రతి గ్రామంలోనూ కేక్ కట్ చేసి కేటీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించాలని కోరారు. మండల కేంద్రంలో జరిగే జన్మదిన వేడుకలు, అన్నదాన కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెల్ల రవికుమార్ విజ్ఞప్తి చేశారు. ఈ విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ మండల సీనియర్ నాయకులు



వల్లేపల్లి శ్రీనివాసరావు, మోరే కిషన్, శంకర్ గౌడ్, కప్ప సంతోష్, నజీర్, అరవింద్, జలాల్ తదితరులు పాల్గొన్నారు.

# రేపు ప్రతి మండలం, టౌన్, డివిజన్ కేంద్రంలో కాంగ్రెస్ శాంతియుత నిరసనలు

- రాహుల్ గాంధీ సహా ప్రతిపక్ష నేతల అరెస్టులకు నిరసన..
- కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు డిమాండ్

కామారెడ్డి, జూలై 22 (జన సంఘర్షణ):
ఏఐసీసీ, టీపీసీసీ ఆదేశాల మేరకు ఈ నెల 23వ తేదీ గురువారం ఉదయం 10 గంటలకు కామారెడ్డి జిల్లా పరిధిలోని ప్రతి మండలం, టౌన్, డివిజన్ కేంద్రాల్లో మహాత్మా గాంధీ విగ్రహాల వద్ద శాంతియుత నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) పిలుపునిచ్చింది. సంబంధిత మండల, టౌన్, డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుల ఆధ్వర్యంలో జరిగే ఈ నిరసన కార్యక్రమాల్లో కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో పాటు ఇతర ప్రతిపక్ష నాయకుల అరెస్టులను ఖండించడంతో పాటు, నీట్ (చీజుజు) పేపర్ లీక్ వ్యవహారంపై కేంద్ర విద్యాశాఖ మంత్రి శ్రీ ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన తెలియజేయనున్నట్లు డీసీసీ పేర్కొంది. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, మండల, టౌన్, డివిజన్ కమిటీ సభ్యులు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, మహిళా కాంగ్రెస్, సేవాదళ్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని పార్టీ విజ్ఞప్తి చేసింది.

**డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ కీలక సూచనలు**

జిల్లాలోని ప్రతి మండలం, టౌన్, డివిజన్ కేంద్రంలో తప్పనిసరిగా నిరసన కార్యక్రమం నిర్వహించాలని డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ సూచించారు. కార్యక్రమాలను నిర్వహించని సంబంధిత అధ్యక్షులపై పార్టీ పరంగా చర్యలు తీసుకునే అవకాశం ఉందని స్పష్టం చేశారు. అలాగే ఈ నెల 24వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు నిర్వహించిన నిరసన కార్యక్రమాలకు సంబంధించిన పూర్తి వివరాలు, ఫోటోలు, వీడియోలతో పాటు కార్యక్రమాలు నిర్వహించని మండలం, టౌన్, డివిజన్‌ల వివరాలను, సంబంధిత అధ్యక్షుల సమాచారంతో సహా కనెక్ట్ సెంటర్‌కు జిల్లా అధ్యక్షులు పంపించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ మేరకు టీపీసీసీ నుంచి ఆదేశాలు జారీ అయినట్లు పేర్కొన్నారు. కావున కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, కాంగ్రెస్ పార్టీ అనుబంధ విభాగాల నాయకులు, శ్రేణులు అందరూ బాధ్యతాయుతంగా పెద్ద




సంఖ్యలో పాల్గొని శాంతియుత నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ విజ్ఞప్తి చేసింది.

# కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులందరికీ నమస్కారాలు

- పొతంగల్ మండల కేంద్రంలో మాజీ డీసీసీబీ చైర్మన్, యువ నాయకులు పోచారం భాస్కర్ రెడ్డి జన్మదిన వేడుకలు



పొతంగల్/జూలై 22/(జన సంఘర్షణ)
రేపు అనగా 23వ తేదీ ఉదయం 9:00 గంటలకు పొతంగల్ మండల బస్టాండ్ ఆవరణలో మాజీ డీసీసీబీ చైర్మన్, యువ నాయకులు పోచారం భాస్కర్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించనున్నాము. ఈ కార్యక్రమానికి ఉమ్మడి మండలాల ఏఎంసీ చైర్మన్లు, మాజీ జెడ్పీటీసీ సభ్యులు, మాజీ ఎంపీపీలు, మాజీ ఏఎంసీ చైర్మన్లు, ఉమ్మడి మండలాల అన్ని గ్రామాల సర్పంచులు, మండల కాంగ్రెస్ పార్టీ యువజన అధ్యక్షులు మరియు కార్యవర్గ సభ్యులు, ఉపసర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీ సభ్యులు, సింగిల్ విండో అధ్యక్షులు, మండల ప్రజాప్రతినిధులు, పార్టీ సీనియర్ నాయకులు, పొతంగల్ మండలంలోని అన్ని గ్రామాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కార్యదర్శులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మనస్ఫూర్తిగా కోరుతున్నాము. పోచారం భాస్కర్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి. మీ ఇట్లుపుప్పాల శంకర్పొతంగల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పేర్కొన్నారు.

## జిల్లా మాజీ డీసీసీ చైర్మన్‌కు ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు బర్ల మధుకర్

కోటగిరి/పోతంగల్, జూలై 22 (జన సంఘర్షణ):
జిల్లా మాజీ డీసీసీ చైర్మన్‌ని కోటగిరి, పోతంగల్ మండలాల సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు బర్ల మధుకర్ మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించి జన్మదిన శు భాకాంక్షలు తెలియజేశారు. ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవిస్తూ ప్రజాసేవలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని బర్ల మధుకర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు పాల్గొని మాజీ డీసీసీ చైర్మన్‌కు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.




# విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడొద్దు..!: కాంగ్రెస్

రుద్రూర్, జూలై 22 (జన సంఘర్షణ):





విద్యార్థుల సమస్యలపై ఢిల్లీలో నిరసన వ్యక్తం చేసిన కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ రుద్రూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వినూత్న నిరసన కార్యక్రమం నిర్వహించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇందూర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ నిరసనలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కళ్లకు గంతలు కట్టుకుని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. విద్యార్థుల విద్య, ఉపాధి అవకాశాల విషయంలో కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన విధానాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. యువత భవిష్యత్తును కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని, విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం చేయకూడదని అన్నారు. విద్యార్థుల సమస్యలపై ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపిన రాహుల్ గాంధీని అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనని వారు పేర్కొన్నారు. "విద్యార్థుల భవిష్యత్తే దేశ భవిష్యత్తు.. యువత ఆకాంక్షలను గౌరవించి, విద్యకు న్యాయం చేయాలి" అని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో రుద్రూర్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సంఘీభావాన్ని తెలిపారు.

# ఛలో లోక్ భవన్ నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేసిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

- పాల్గొన్న టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్.

హైదరాబాద్ సిటీ, కూకట్పల్లి ప్రతినిధి అంజిబాబు, జూలై 22, (జన సంఘర్షణ):




విద్యార్థుల సమస్యలపై గళం విప్పుతూ ఢిల్లీలో ప్రధానమంత్రి నివాసం వద్ద శాంతియుత ధర్నా నిర్వహించిన ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీని అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ ) పిలుపు మేరకు హైదరాబాద్‌లో నిర్వహించిన "చలో లోక్ భవన్" నిరసన కార్యక్రమం విజయవంతంగా జరిగింది. ఈ సందర్భంగా టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో నెక్లెస్ రోడ్ నుండి లోక్ భవన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు, పలువురు ఎమ్మెల్యేలు, మాజీ ప్రజాప్రతినిధులు, టీపీసీసీ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ సారథ్యంలో కూకట్పల్లి నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, బ్లాక్ మరియు డివిజన్ అధ్యక్షులు, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, మహిళా కాంగ్రెస్, సేవాదళ్ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లి నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యలపై పోరాడుతున్న రాహుల్ గాంధీని అక్రమంగా అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు. విద్య, ఉపాధి, యువత భవిష్యత్తుకు సంబంధించిన సమస్యలను లేవనెత్తే ప్రతి గొంతును అణచివేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నించడం దురదృష్టకరమని విమర్శించారు.దేశంలోని విద్యార్థులు, యువతకు న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పార్టీ తన పోరాటాన్ని మరింత ఉధృతంగా కొనసాగిస్తుందని బండి రమేష్ స్పష్టం చేశారు.

## కూకట్పల్లి నల్లచెరువును పరిశీలించిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

హైదరాబాద్ సిటీ, కూకట్పల్లి ప్రతినిధి అంజిబాబు, జూలై 22, (జన సంఘర్షణ):



కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కూకట్పల్లిలోని నల్లచెరువును బుధవారం రోజు పరిశీలించారు. ప్రధానంగా చెరువు వద్ద ప్రజలకు కావలసిన మౌలిక సదుపాయాలు, టాయిలెట్స్, మంచినీరు అలాగే ఇండోర్ స్టేడియం, యోగ కేంద్రం, నిర్మాణానికి సంబంధించి చర్యలు తీసుకోవాలని హైడ్రాధికారులకు సూచించారు. లేని ఎడల తన నిధుల మంజూరు చేసి ప్రజలకు అందిస్తామని అన్నారు. గత కేసిఆర్ ప్రభుత్వంలో నల్లచెరువు అభివృద్ధికి పూనుకున్నామని అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత హైడ్రా ఆ పనులు కొనసాగించిందని గుర్తు చేశారు. దీనిలో భాగంగానే పెండింగ్లో ఉన్న టాయిలెట్స్ ఇతర మౌలిక సదుపాయాలు కల్పనకు సత్వరమే చర్యలు తీసుకునే విధంగా అధికారులకు సూచించామని ఆయన తెలిపారు. అలాగే ఈ మొత్తం నల్లచెరువు మెయింటినెన్స్ సంబంధించి జిహెచ్ఎంసి అధికారులకు బదిలీ చేసే విధంగా చూస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు జూపల్లి సత్యనారాయణ, మాధవరం రంగారావు,జనరల్ సెక్రటరీ ప్రభాకర్, సీనియర్ నాయకులు తులసీరావు, కాలనీ అసోసియేషన్ సభ్యులు, హైడ్రాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నాం

- ప్రజల గొంతును అరెస్టులతో అణచలేరు: షాహిద్ హుస్సేన్

కోటగిరి, జూలై 22 (జన సంఘర్షణ):



ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న లోక్‌సభ ప్రతిపక్ష నేత శ్రీ రాహుల్ గాంధీ గారిని అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని కోటగిరి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు షాహిద్ హుస్సేన్ అన్నారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు, ప్రజల హక్కుల పరిరక్షణ కోసం శాంతియుతంగా నిరసన చేపడుతున్న రాహుల్ గాంధీని అరెస్టు చేయడం ప్రజాస్వామ్యంపై జరిగిన దాడిగా ఆయన అభివర్ణించారు.విద్యార్థుల భవిష్యత్తు, ప్రజల హక్కులు, సామాజిక న్యాయం కోసం ప్రశ్నిస్తున్న నాయకుల గొంతును అణచివేయాలనే ప్రయత్నాలు ఎప్పటికీ ఫలించవని అన్నారు. ప్రజల తరఫున పోరాడుతున్న నాయకులను అరెస్టులు చేసి ఉద్యమాలను ఆపలేరని, ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని షాహిద్ హుస్సేన్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ డెలిగేట్, మాజీ ఎంపీటీసీ కొట్టం మనోహర్, కోటగిరి మార్కెట్ కమిటీ చైర్మన్ గైక్వాడ్ హనుమంతు, గంగాధర్ దేశాయ్, మైనారిటీ నాయకులు జుబేర్ భాయ్, వహీద్ భాయ్, అహ్మద్ భాయ్, కూచి సిద్ధు అన్న, అఫ్జల్ భాయ్ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక



## పైనుండి వాన.. కింద సీసీ రోడ్డు పనులు..

**● బరంగేడ్గిలో కాంట్రాక్టర్ తీరుపై విమర్శలు**




**బీర్కూర్./జూలై 22/(జన సంఘర్షణ)**
బీర్కూర్ మండలం బరంగేడ్గి గ్రామంలో వర్షం కురుస్తున్న సమయంలోనే సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టడం స్థానికంగా చర్చనీయాంశమైంది. గ్రామాల అభివృద్ధికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తూ పలు అభివృద్ధి పనులు చేపడుతున్న నేపథ్యంలో, కొందరు కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలను విస్మరించి ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వర్షం పడుతుండగానే కాంక్రీట్ వేయడం వల్ల రోడ్డు నాణ్యత దెబ్బతినే అవకాశం ఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు పనులను పరిశీలించి, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నారా లేదా అనే అంశంపై విచారణ చేపట్టి, అవసరమైతే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## జిల్లా మాజీ డీసీసీ చైర్మన్‌కు ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు



**పోతంగల్, జూలై 22 (జన సంఘర్షణ):**
జిల్లా మాజీ డీసీసీ చైర్మన్ గారిని మర్యాదపూర్వకంగా కలిసి పోతంగల్ మండల సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు సాజీ పటేల్ హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సాజీ పటేల్ మాట్లాడుతూ... ప్రజా సేవలో మరింత ఉన్నత స్థానాలను అధిరోహిస్తూ, ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు. ప్రజలకు మరింత సేవ చేసే శక్తి, సామర్థ్యం భగవంతుడు ప్రసాదించాలని కోరుకుంటూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని మాజీ డీసీసీ చైర్మన్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు ఆత్మీయ ఆహ్వానం...



**కోటగిరి/జూలై 22/(జనసంఘర్షణ)**
మన ప్రియతమ నాయకులు, నిజామాబాద్ మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి జన్మదిన వేడుకలను పురస్కరించుకుని కోటగిరి మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా కార్యక్రమాలు నిర్వహించనున్నాము.
తేదీ: 23-07-2026, గురువారం
సమయం: ఉదయం 9:30 గంటలకు
వేదిక: కోటగిరి మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద
ఈ సందర్భంగా కేక్ కటింగ్ మరియు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది.
కావున కోటగిరి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ జడ్పీటీసీలు, మాజీ పీఏసీఎస్ చైర్మన్లు, కోటగిరి మండల పరిధిలోని గ్రామాల సర్పంచులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు, కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా మనస్ఫూర్తిగా కోరుతున్నాము.
మీ రాకే మా బలం... మీ భాగస్వామ్యమే మా నాయకుడికి ఘనమైన జన్మదిన కానుక! మీఇట్లు, షాహిద్ హుస్సేన్, కోటగిరి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆయన పేర్కొన్నారు.

## నీట్ పేపర్ లీకేజీపై కేంద్రం సమాధానం చెప్పాలి

**● కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం**



**బాన్సువాడ ప్రతినిధి:/జూలై 22/ (జనసంఘర్షణ)**
నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తూ పార్లమెంట్ వద్ద నిరసన చేపట్టిన విద్యార్థులు, కాంగ్రెస్ జాతీయ నాయకులపై పోలీసులు భాష్పవాయువు ప్రయోగించి లాఠీచార్జి చేయడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని తాడ్కోల్ చౌరస్తాలో ఆందోళన నిర్వహించారు. రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజ్ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా కాసుల బాలరాజ్ మాట్లాడుతూ.. నీట్ పేపర్ లీకేజీపై కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తమ జాతీయ నాయకులు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీతో పాటు ఇతర నాయకులు ప్రధాని మోదీ నివాసం ఎదుట నిరసన చేపట్టారని తెలిపారు. నీట్ వ్యవహారంపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ బాధ్యత వహించి రాజీనామా చేయాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారని అన్నారు. విద్యార్థులపై జరిగిన పోలీసుల చర్యపై పార్లమెంటులో చర్చ జరపాలని, నీట్ మృతుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేసినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరిని కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అసద్ బిన్ మొహసిన్, కౌన్సిలర్ మహమ్మద్ కాలిక్, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మన్సూర్, నందకిషోర్, కో-ఆప్షన్ సభ్యులు కమర్ గౌస్, అబ్దుల్ మజీద్, వహాబ్ బై, మాజీ జెడ్పీటీసీ గోపాల్ రెడ్డి, కౌన్సిలర్ నగేష్, గుడాల నగేష్, మట్ట సాయిలు యాదవ్, దాసరి శ్రీనివాస్, బోడ భాస్కర్ తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విక్రమ్-1 రాకెట్ విజయగాథలో నిజామాబాద్ జిల్లా బిడ్డ సత్తా!

**● అంతరిక్ష విజయ ప్రస్థానంలో కోటగిరి యువ ఇంజనీర్ మహాజన్ అఖిల్ కీలక పాత్ర**

**● గ్రామం నుంచి అంతరిక్షం వరకు.. యువతకు స్ఫూర్తిగా నిలిచిన అఖిల్**

**కోటగిరి, జూలై 22 (జనసంఘర్షణ):**
గ్రామీణ ప్రాంతం నుంచి ఎదిగి దేశ అంతరిక్ష రంగంలో తన ప్రతిభను చాటుకున్న కోటగిరి యువ ఇంజనీర్ మహాజన్ అఖిల్ ఇప్పుడు నిజామాబాద్ జిల్లా ఖ్యాతిని జాతీయ స్థాయికి తీసుకెళ్లారు. భారత ప్రైవేట్ అంతరిక్ష రంగంలో కీలకమైన విక్రమ్-1 రాకెట్ విజయ ప్రస్థానంలో అఖిల్ సాంకేతిక బృందంలో భాగస్వామిగా కీలక పాత్ర పోషించడం జిల్లా ప్రజలకు గర్వకారణంగా మారింది. కోటగిరి మండల కేంద్రానికి చెందిన స్వర్గీయ మహాజన్ విఠల్ కుమారుడైన అఖిల్ ప్రస్తుతం హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న స్కైరూట్ ఏరోస్పేస్ సంస్థలో ఇంజనీర్‌గా సేవలందిస్తున్నారు. విక్రమ్-1 రాకెట్ తయారీ, ప్రయోగ ప్రక్రియలో సాంకేతిక బృందంలో భాగంగా ఆయన తన నైపుణ్యాన్ని అందించారు. అఖిల్ ఎంటెక్ పవర్ ఎలక్ట్రానిక్స్ పూర్తి చేసి, సుమారు ఆరు సంవత్సరాల పాటు డీఆర్‌డీఓలో రీసెర్చ్ అసిస్టెంట్‌గా సేవలందించారు. రక్షణ రంగంలో సంపాదించిన అనుభవాన్ని అంతరిక్ష సాంకేతిక రంగంలో వినియోగిస్తూ, ప్రస్తుతం దేశ ప్రైవేట్ స్పేస్ రంగంలో కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. చిన్న ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపేందుకు రూపొందించిన విక్రమ్-1 రాకెట్ ప్రాజెక్టులో భాగస్వామ్యం కావడం ద్వారా అఖిల్ తన ప్రతిభను నిరూపించుకున్నారు. ఈ విజయం భారత ప్రైవేట్ అంతరిక్ష రంగానికి కొత్త అవకాశాలకు బాటలు వేస్తుండగా, కోటగిరి వంటి గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చిన ఓ యువకుడు ఈ చారిత్రక ప్రస్థానంలో భాగస్వామి కావడం మరింత విశేషంగా నిలిచింది. "పట్టుదలతో కృషి చేస్తే గ్రామం నుంచి వచ్చిన యువత కూడా అంతరిక్షాన్ని అందుకోగలరు" అనే సందేశాన్ని అఖిల్ తన విజయంతో చాటిచెప్పారు. ఆయన సాధించిన ఘనత జిల్లా యువతకు స్ఫూర్తిగా







నిలుస్తోందని స్థానికులు పేర్కొంటున్నారు. అఖిల్ విజయంతో కోటగిరి ప్రజలు, ఆయన కుటుంబ సభ్యులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. కోటగిరి గడ్డపై పుట్టి.. దేశ అంతరిక్ష విజయగాథలో భాగస్వామిగా నిలిచిన మహాజన్ అఖిల్ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని స్థానిక ప్రజాప్రతినిధులు, యువత ఆకాంక్షిస్తున్నారు.

## ప్రజాసేవతో ప్రజల మనసులు గెలుచుకుంటున్న యువ నాయకుడు పోచారం భాస్కర్ రెడ్డి

**● రేపు జన్మదినం ముందస్తు శుభాకాంక్షలతో వెల్లువెత్తుతున్న అభిమానుల సందేశాలు**

**● జుబేర్ భాయ్ ఆధ్వర్యంలో హృదయపూర్వక ముందస్తు జన్మదిన శుభాకాంక్షలు.....**

**బాన్సువాడ, జూలై 22 (జనసంఘర్షణ):**
ప్రజలతో మమేకమై, సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్న యువ నాయకుడు పోచారం భాస్కర్ రెడ్డి రేపు (జూలై 23) తన జన్మదినాన్ని జరుపుకోనున్నారు. ఈ సందర్భంగా ఆయనకు అభిమానులు, శ్రేయోభిలాషులు, యువత పెద్ద ఎత్తున ముందస్తు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. సోషల్ మీడియా, వాట్సాప్ వేదికలపై ప్రత్యేక పోస్టర్లు, శుభాకాంక్షల సందేశాలు వైరల్‌గా మారుతున్నాయి. సీనియర్ నాయకుడు పోచారం శ్రీనివాస్ రెడ్డి ప్రజాసేవా స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని, ప్రజల సమస్యలను తెలుసుకుంటూ వారికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేందుకు పోచారం భాస్కర్ రెడ్డి కృషి చేస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు. ప్రజలతో సన్నిహితంగా ఉంటూ, సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావడం ద్వారా ఆయన ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారని అభిమానులు అభిప్రాయపడుతున్నారు. జన్మదిన వేడుకలకు ఒక రోజు ముందుగానే శుభాకాంక్షలు







వెల్లువెత్తుతుండటంతో బాన్సువాడ ప్రాంతంలో సందడి వాతావరణం నెలకొంది. యువ నాయకుడిగా భాస్కర్ రెడ్డి మరింత ఉన్నత స్థాయికి ఎదిగి, ప్రజాసేవలో ముందుకు సాగాలని అభిమానులు, యువత, శ్రేయోభిలాషులు ఆకాంక్షిస్తున్నారు.

**జుబేర్ భాయ్ ముందస్తు జన్మదిన శుభాకాంక్షలు**

వ్యాపారవేత్త, సామాజిక సేవకుడు జుబేర్ భాయ్ యువ నాయకుడు పోచారం భాస్కర్ రెడ్డికి హృదయపూర్వక ముందస్తు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవిస్తూ ప్రజాసేవలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జుబేర్ భాయ్ మాట్లాడుతూ.. "ప్రజల ప్రేమను సంపాదించిన నాయకత్వమే చిరస్థాయిగా నిలుస్తుంది. సేవా భావంతో ముందుకు సాగే ప్రతి అడుగు సమాజానికి స్ఫూర్తిదాయకం. పోచారం భాస్కర్ రెడ్డి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధిస్తూ ప్రజలకు మరింత సేవ చేయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అని అన్నారు. రేపటి జన్మదిన వేడుకలు ఘనంగా జరగాలని, భాస్కర్ రెడ్డికి మరెన్నో విజయాలు, ఆయురారోగ్యాలు కలగాలని అభిమానులు, శ్రేయోభిలాషులు ఆకాంక్షిస్తున్నారు. కోటగిరి మైనార్టీ యంగ్ డైనమిక్ లీడర్ జుబేర్ భాయ్ పేర్కొన్నారు.

## కంపెనీ లాకర్లో కన్నం..

**● అన్నదమ్ముల అరెస్ట్..కిలో బంగారం రికవరీ..**

**జూబ్లీహిల్స్/జూలై 22 /(జన సంఘర్షణ)**
టాస్క్ ఫోర్స్,బంజారాహిల్స్ పోలీసుల సంయుక్త ఆపరేషన్లో కేసు ఛేదన తాను పనిచేస్తున్న సంస్థలోని బంగారు ఆభరణాలపై కన్నేసిన ఓ ఉద్యోగి, సొంత సోదరుడితో కలిసి పక్కా ప్రణాళికతో చోరీకి పాల్పడిన ఘటన హైదరాబాద్లో వెలుగుచూసింది. బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ కేసులో కమిషనరేట్ టాస్క్ ఫోర్స్ (జూబ్లీహిల్స్ జోన్), బంజారాహిల్స్ పోలీసులు సంయుక్తంగా దర్యాప్తు చేపట్టి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ. కోట్ల విలువైన 1 కిలో 28.59 గ్రాముల బంగారు ఆభరణాలను పూర్తిగా స్వాధీనం చేసుకున్నట్లు డీసీపీ (టాస్క్ ఫోర్స్) గాయక్వాడ్ వైభవ్ రఘునాథ్ తెలిపారు. ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం.. కర్ణాటకలోని బీదర్ జిల్లా భాల్కి తాలూకా మారోర్ జోల్దప్కా గ్రామానికి చెందిన సన్ కాంబ్లే హరీష్ (29), సన్ కాంబ్లే ఆకాష్ (25) సొంత అన్నదమ్ములు. ప్రస్తుతం హైదరాబాద్ లోని మంగళ్ హాట్లో నివసిస్తున్నారు. హరీష్ 'గురుకృపా ఎక్స్పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్'లో సేల్స్ ఎగ్జిక్యూటివ్గా పనిచేస్తుండగా, ఆకాష్ హైటెక్ సిటీలోని పీడబ్ల్యూసీ లో ఆఫీస్ బాయ్ పనిచేస్తున్నాడు. హరీష్ విధుల్లో భాగంగా హైదరాబాద్లోని ప్రముఖ జ్యువెలరీ షోరూమైన కృష్ణ పర్ల్స్, శ్రీ జ్యువెలర్స్, అపర్ణ జ్యువెలర్స్, జోయాలుక్కాస్, మనేపల్లి జ్యువెలర్స్, తదితర షోరూమ్లకు కొత్త గోల్డ్, డైమండ్ డిజైన్లను చూపిస్తూ ఆర్డర్లు తీసుకొచ్చేవాడు. అనంతరం కంపెనీ నుంచి ఆభరణాలను తీసుకెళ్లి ఆయా షోరూమ్లకు డెలివరీ చేసి, వారి నుంచి చెక్కులు సేకరించి కార్యాలయంలో జమ చేసేవాడు. దీంతో కంపెనీ లాకర్లో నిల్వ ఉంచిన బంగారు ఆభరణాలపై అతడికి పూర్తి సమాచారం ఏర్పడింది. ఆర్థిక ఇబ్బందుల కారణంగా లాకర్లోని బంగారు ఆభరణాలను దొంగిలించాలని హరీష్ నిర్ణయించుకున్నాడు. ఈ విషయాన్ని తన సోదరుడు ఆకాష్కు చెప్పగా, అతడూ అంగీకరించాడు. జులై 16న మొదట కార్యాలయంలో రెక్కీ నిర్వహించి చోరీకి ప్రయత్నించినా అది విఫలమైంది. మరుసటి రోజు జులై 17న హరీష్ కార్యాలయానికి వెళ్లి ముందుగా విద్యుత్ సరఫరాను నిలిపివేశాడు. అనంతరం బాత్రూమ్ గ్రిల్ను ధ్వంసం చేసి లోపలికి ప్రవేశించి లాకర్లో ని బంగారు



ఆభరణాలను అపహరించాడు. ఆ ఆభరణాలను బయటకు తీసుకొచ్చి తన సోదరుడు ఆకాష్కు అప్పగించగా, అతడు వాటిని తన వద్ద దాచిపెట్టాడు.... నేరం చేసే సమయంలో తమ గుర్తింపును దాచేందుకు కూడా ప్రయత్నించారు. చోరీపై సమాచారం అందుకున్న జూబ్లీహిల్స్ జోన్ టాస్క్ ఫోర్స్, బంజారాహిల్స్ పోలీసులు సీసీటీవీ దృశ్యాలు, సాంకేతిక ఆధారాలను విశ్లేషించి మంగళ్హాట్లో ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి ఏడు బంగారు నెక్లెస్లు, ఏడు జతల బంగారు కమ్మలు కలిపి మొత్తం 1 కిలో 28.59 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఆపరేషన ను టాస్క్ ఫోర్స్ జూబ్లీహిల్స్ జోన్ ఇన్స్పెక్టర్ ఛత్రాసింగ్ యాదేందర్, ఎస్ఐ మహమ్మద్ జాహెద్, టాస్క్ ఫోర్స్ సిబ్బంది, బంజారాహిల్స్ డిఐ కవియోద్దీన్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించినట్లు తెలిపారు.

Printed, published and owned by **Rachamallu Madhavi** Printed at **Kranthi Printing Press**, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : **Rachamallu Madhavi**. **RNI Reg No :tel/2024/89323,** Cell 6305026524, Email:janasangarshana@gmail.co